


# విజయభాను




విశాఖపట్నం, శుక్రవారం 23-06-2023 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 47 సంచిక : 234 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## ఎలాంటి సహకారం కావాలన్నా
# అండగా ఉంటాం

- ఏపీలో మరో రూ. 1425 కోట్ల పెట్టుబడులు సాకారం
- పలు ప్రాజెక్టులకు సీఎం జగన్ వర్చువల్‌గా శంకుస్థాపన



అమరావతి, (విజయభాను న్యూస్) : ఏపీలో మరో రూ.1425 కోట్ల పెట్టుబడులు సాకారం అవుతున్నాయి. పలు ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.క్రిబ్‌కో గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, విశ్వసముద్ర బయో ఎనర్జీ, సీసీఎల్ ఫుడ్ అండ్ బెవరేజెస్ పరిశ్రమలకు సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ సంస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ, దాదాపుగా రూ.1425 కోట్ల పెట్టుబడితో 3 జిల్లాల్లో మంచి కార్యక్రమం జరుగుతుందని, దీని వల్ల దాదాపుగా 2500 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ జిల్లాల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. మూడు ప్లాంట్లకు శంకుస్థాపన చేయడంతో పాటు ఒక ప్లాంట్‌ను ప్రారంభిస్తున్నాను. శంకుస్థాపన చేసిన ప్లాంట్లన్నీ కూడా త్వరలో నిర్మాణం అవుతాయని ఆయన అన్నారు. “నెల్లూరులో క్రిబ్‌కో ఆధ్వర్యంలో దాదాపుగా రూ.610 కోట్ల పెట్టుబడితో ఇథనాల్ తయారీ ప్లాంట్ వస్తుంది. 12 నెలల్లోపే ఈ కర్మాగార నిర్మాణం పూర్తవుతుంది. 500 కిలోలీటర్ల ప్రొడక్షన్ కెపాసిటీతో బయో ఇథనాల్ ప్లాంట్ రెండు దశల్లో ప్లాంట్ పూర్తయితే 1000 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఎలాంటి సహకారం కావాలన్నా ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది” అని సీఎం అన్నారు. “ఒక్క ఫోన్ కాల్ దూరంలో మీకు అందుబాటులో ఉంటామన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోండి. ఇదే నెల్లూరు జిల్లాలో విశ్వసముద్ర బయో ఎనర్జీ ప్లాంట్ వస్తోంది. రోజుకు 200 కిలోలీటర్ల కెపాసిటీతో నెలకొల్పుతున్న బయో ఇథనాల్ ప్లాంట్ ఇది. దీనివల్ల 500 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు వస్తాయి. రూ.315 కోట్లతో వచ్చే ఈ ప్రాజెక్టు కూడా మరో 18 నెలల్లో అందుబాటులోకి వస్తుంది. చదువుకున్న మన పిల్లలకు ఈ ప్లాంట్ వల్ల ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఇది చాలా సంతోషకరమైన విషయం. ప్లాంట్ డైరెక్టర్ జితేంద్రతో పాటు యాజమాన్యానికి మనస్ఫూర్తిగా అభినందనలు” అని సీఎం పేర్కొన్నారు. “అదే విధంగా తిరుపతి జిల్లాలో కాంటినెంటల్ కాఫీ కూడా ఫ్యాక్టరీ పెడుతోంది. రూ.400 కోట్ల పెట్టుబడితో..ఏటా 16వేల టన్నుల కెపాసిటీతో ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 400 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఏలూరు జిల్లాలో గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ సంస్థ ఏర్పాటు చేస్తుంది.రూ.100 కోట్ల పెట్టుబడితో 400 టన్నుల

తరువాయి 2లో..

## అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో
# ప్రధాని మోదీ భేటీ



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో ప్రధాని నరేంద్రమోదీ భేటీ అయ్యారు. ప్రధానికి బైడెన్ దంపతులు నేడు విందు ఇవ్వనున్నారు. రేపు అమెరికా ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ దంపతులు ఏర్పాటు చేసే విందుకు మోదీ హాజరుకానున్నారు. నేడు అమెరికా కాంగ్రెస్‌లో మోదీ ప్రసంగించనున్నారు.

**ఆశీర్వదించిన ఇంద్ర దేవత..**

శ్వేత సౌధానికి వెళ్లేందుకు మోదీ వాషింగ్టన్ డీసీకి చేరుకొనే సమయానికి వర్షం పడుతోంది. అయినా, ఇండో-అమెరికన్లు ఆయన కోసం వేచి ఉండి స్వాగతం పలికారు. దీనిపై మోదీ ట్విటర్‌లో స్పందించారు. “వాషింగ్టన్ డీసీ చేరుకొన్నాను. భారతీయుల ఆత్మీయ స్వాగతం.. ఇంద్రదేవత ఆశీర్వాదం (వర్షాన్ని ఉద్దేశించి) దీనిని మరింత స్పెషల్‌గా చేశాయి” అని పేర్కొన్నారు.

అనంతరం ప్రధాని మోదీ శ్వేతసౌధానికి చేరుకున్నారు. అక్కడ జో బైడెన్, ఆయన సతీమణి జిల్ బైడెన్ స్వాగతం పలికారు. జో బైడెన్, ఆయన కుటుంబీకులను మోదీ ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ విషయాన్ని భారత విదేశాంగశాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చి

తరువాయి 2లో..

## ఓటు వేసిన ప్రతిఒక్కరూ వైసీపీ ప్రభుత్వాన్ని నిలదీయాలి

### జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్



కోనసీమ: వైసీపీ ప్రభుత్వం ప్రజలను వంచిస్తోందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. ప్రభుత్వం సంక్షేమం ముసుగులో హక్కులను కాలరాస్తోందని, ఏపీలో ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక అమలు ఊసే లేదని, మధ్య తరగతి వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పవన్ మండిపడ్డారు. నవరత్నాలతో అవసరం ఏముంది?, సబ్‌ప్లాన్‌ను జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఓటు వేసిన ప్రతిఒక్కరూ ప్రభుత్వాన్ని నిలదీయాలని, రైతు భరోసా కేంద్రాల పేరుతో అడ్డంగా మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఏపీని గంజాయి హబ్‌గా మార్చేశారని పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. జనసేన అధికారంలోకి వస్తే శాంతిభద్రతలపై దృష్టి సారిస్తానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. తనకిష్టమైన రెండు చెప్పులు ఎవరో దొంగిలించారని, గుళ్లో పెట్టిన చెప్పులు కూడా వైసీపీ దొంగిలిస్తోందని పవన్ విమర్శించారు. పిఠాపురంలో వారాహి

## శ్రీవాణి ట్రస్ట్‌పై శ్వేతపత్రం విడుదల చేస్తాం : తితిదే ఈవో




తిరుమల, (విజయభాను న్యూస్) : శ్రీవాణి ట్రస్ట్‌పై శ్వేతపత్రం విడుదల చేస్తామని తితిదే ఈవో ధర్మారెడ్డి తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో పీఠాధిపతులతో ఆయన సమావేశమయ్యారు. శ్రీవాణి ట్రస్ట్ నిధుల వినియోగంపై వస్తోన్న ఆరోపణలను ఈ సందర్భంగా పీఠాధిపతులు, స్వామీజీలు ఖండించారు. ఆ నిధులు సద్వినియోగమవుతున్నాయని చెప్పారు. శ్రీవాణి ట్రస్ట్ నిధులతో పలు ఆలయాల నిర్మాణం, పురాతన ఆలయాల పునరుద్ధరణను తితిదే చేపట్టిందన్నారు. అనంతరం ఈవో మాట్లాడుతూ శ్రీవాణి ట్రస్ట్‌కు ఆన్‌లైన్ ద్వారా రూ.475.57 కోట్లు, ఆఫ్‌లైన్ ద్వారా రూ.350.82 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. అమరావతిలో రూ.150కోట్లతో ఆలయం నిర్మించామని చెప్పారు.

## దేశంలో ప్రధాని లేని సమయంలో సమావేశమా..? మండిపడ్డ కాంగ్రెస్

దిల్లీ: రెండు రోజులుగా ప్రధాని మోదీ అమెరికా పర్యటనే హైలైట్ పాయింట్‌గా ఉంది. ఈ పర్యటన నేపథ్యంలో మణిపూర్‌లో చెలరేగుతున్న హింసను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. మణిపూర్ హింసాత్మక ఘటనల పై చర్చించేందుకు జూన్ 24న అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు గురువారం ఉదయం కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ట్విటర్ వేదికగా స్పందించారు. ‘50 రోజులుగా మణిపూర్ భగ్గుమంటోంది. కానీ ఈ విషయంపై ప్రధాని మోదీ మౌనం ఉన్నారు. ఆయన దేశంలో లేనప్పుడు అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. ఈ సమావేశం ప్రధానికి అంత ముఖ్యం కాదని స్పష్టమవుతోంది’ అని రాహుల్ దుయ్యబట్టారు. ఆ పార్టీ నేత దిగ్విజయ్ సింగ్ కూడా ఇదే తరహాలో విమర్శలు చేశారు. మణిపూర్ మండిపోతుంటే.. ప్రధాని అంతర్జాతీయ పర్యటనలో ఉన్నారని విరుచుకుపడ్డారు. జాతుల మధ్య వైరంతో గత కొద్దికాలంగా మణిపూర్ మండిపోతోంది. కేంద్ర హోం శాఖ, రాష్ట్ర ప్రభుత్వం శాంతిస్థాపనకు ప్రయత్నాలు చేస్తున్నా..

తరువాయి 2లో..




# గిరి ప్రదర్శన ఏర్పాట్లు పరిశీలన



విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదర్శన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఏ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ తదితరులు గురువారం పరిశీలించారు. జూలై 2వ తేదీన శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి గిరి ప్రదర్శనకు వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకాలు ఎదురవకుండా చర్యలు తీసుకోవడం, గిరి ప్రదర్శనకు రాష్ట్ర నలుమూల నుండే కాకుండా పక్క రాష్ట్రాల నుండి వచ్చే లక్షలాదిమంది భక్తుల కొరకు చేపట్టబోయే ఏర్పాట్లను అధికారులతో కలెక్టర్ పరిశీలించారు. ముఖ్యంగా రోడ్లు, విద్యుత్తు ద్వీపాలు, తాగునీరు, మొబైల్ మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, జోడుగుళ్లపాలెంలో మహిళలు స్నానం చేసేందుకు ఏర్పాట్లతో పాటు బట్టలు మార్చుకునేందుకు టెంట్లు ఏర్పాటు చేసే ప్రదేశాలు మొదలైనవి పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల సమన్వయతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గిరి ప్రదర్శన విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఈవో భ్రమరాంబ, జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాని ఇంజనీరు రవికృష్ణరాజు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, జివిఎంసి అధికారులు, భీమిలి ఆర్డిఓ, పోలీస్ యంత్రాంగం, రెవిన్యూ అధికారులు, దేవస్థానం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యోగ-ఆక్యుప్రెజర్ పుస్తకావిష్కరణ



ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్)** : ఆంధ్రవిశ్వవిద్యాలయం యోగా కేంద్రం నేచురోపతి వైద్యులు డాక్టర్ ఆర్.తులసి రావు రచించిన యోగ-ఆక్యుప్రెజర్ పుస్తకాన్ని గురువారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ఆవిష్కరించారు. పుస్తక రచయితను అభినందించి, ప్రజలకు ఉపయుక్తంగా మరిన్ని పుస్తకాలు రచించాలని సూచించారు.

కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత,రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, మాజీ వీసీ ఆచార్య వి.బాల మోహన్ దాస్, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి యోగా కేందర్ం సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు భానుకుమార్, డాక్టర్ తులసి రావు తదితరులు పాల్గొన్నారు.

## అంతార్జతీయ సదస్సులో పాల్గొన్న ఏయూ ఆచార్యుడు

ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్)** : ఆంధ్రవిశ్వవిద్యాలయం జియో ఫిజిక్స్ విభాగం ఆచార్యులు పి.త్రినాథ రావు ఇండోనేషియాలోని జకార్తాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ప్రపంచవ్యాప్తంగా 71 మంచి పరిశోధన పత్రాలు సదస్సుకు ఎంపికకాగా వీటిలో ఒకటి ఆచార్య త్రినాథ రావు పరిశోధన పత్రం. ఈ సందర్భంగా త్రినాథ రావును ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తన కార్యాలయంలో త్రినాథరావును అభినందించారు.

## ఏయూ ను సందర్శించిన ఇరాక్ దేశస్తులు



ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్)** : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని ఇరాక్ దేశ విద్యమంత్రిత్వ శాఖ ఇంగ్లీష్ లాంగ్వేజ్ కరికులం విభాగాధిపతి, ఏయూ పూర్వ విద్యార్థిని హింద్ ఫరూక్ ఆలీ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూ పూర్వ విద్యార్థిగా వర్సిటీ అభివృద్ధి జరుగుతున్న విధానం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వర్సిటీ తరపున ఫరూక్ ఆలీని సత్కరించారు. కార్యక్రమంలో ఏయూ విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# లోయలోకి దూసుకెళ్లిన కారు.. 10 మంది మృతి

పితోర్‌గఢ్: ఉత్తరాఖండ్‌లోని పితోర్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మున్సియారి వద్ద కారు అదుపుతప్పి 600 మీటర్ల లోతైన లోయలోకి దూసుకెళ్లడంతో అందులో ప్రయాణిస్తున్న 10 మంది ప్రాణాలు కోల్పోయారు. వీళ్లంతా హోక్రాలోని కోకిలా దేవిని దర్శించుకునేందుకు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతదేహాలన్నింటినీ వెలికి తీసినట్లు పితోర్‌గఢ్ విపత్తు నిర్వహణ అధికారి భూపేంద్ర సింగ్ మహర్ తెలిపారు. మృతుల్లో ఏడుగురు బగేశ్వర్ జిల్లాలోని సామ గ్రామానికి చెందిన వారు కాగా.. మరో ముగ్గురు భనార్ గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురియడంతో కొండ చరియలు రోడ్డుపై పడిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు.

వాటిని సరిగా గమనించకపోవడంతోనే ప్రమాదం జరిగి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. కారు లోయలోకి పడినట్లు గుర్తించిన వెంటనే అక్కడున్న వారు సహాయక చర్యలు ప్రారంభించారు. ఈలోగా అక్కడికి చేరుకున్న విపత్తు నిర్వహణ బృంద సభ్యులు మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

# ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందజేస్తాం



వెంకటగిరి: పథకాల పేరుతో రాష్ట్ర ప్రజలకు ఇచ్చినట్లే ఇచ్చి డబ్బులు కాజేస్తున్నారని జగన్ సర్కార్‌పై తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. జగన్ ఒక కట్టింగ్, ఫిట్టింగ్ మాస్టర్ అంటూ విమర్శలు గుప్పించారు. యువగళం పాదయాత్రలో భాగంగా తిరుపతి జిల్లా వెంకటగిరిలో ఆయన మాట్లాడారు. జగన్ వద్ద రెండు బటన్లు ఉన్నాయన్నారు. బల్లపైన గ్రీన్ బటన్ నొక్కితే ఖాతాలో రూ.10 జమ అవుతుందని.. బల్ల కింద ఎర్ర బటన్ నొక్కితే ఖాతాల్లోంచి రూ.100 ఖాళీ అవుతుందని లోకేశ్ అన్నారు. "వైకాపా పాలనలో పెట్రోల్, విద్యుత్, ఆర్టీసీ ఛార్జీలు ఇష్టారీతిన పెంచారు. అన్న క్యాంటీన్, చంద్రన్న బీమా, పింఛన్లు కోత పెట్టారు. వంద సంక్షేమ కార్యక్రమాలకు కోత పెట్టిన ఏకైక సీఎం.. జగన్. ఏటా జాబ్ క్యాలెండర్ పేరిట చేస్తామన్న ఉద్యోగాల భర్తీ హామీ ఏమైంది?" అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెదేపా అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. నిరుద్యోగ భృతి కింద యువతకు రూ.3వేలు అందజేస్తామన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ ద్వారా పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. సంవత్సరానికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందజేస్తామన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందిస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.

## ఎలాంటి సహకారం కావాలన్నా అండగా ఉంటాం

సామర్థ్యంతో ఎడిబుల్ ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టు విస్తరణకు వెళ్తున్నారు. ప్లాంట్ ఏర్పాటుకు మన దగ్గరకు వచ్చిన తర్వాత అనుమతి ఇచ్చిన కేవలం 9 నెలల్లోనే యూనిట్‌ను ప్రారంభోత్సవం చేసుకోవడం అభినందనీయం" అని సీఎం పేర్కొన్నారు.

"ఇందుకు కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి అధికారికి అభినందనలు. ఈ యూనిట్ వల్ల కూడా మరో 500 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు. దాదాపుగా 2500 మందికి ఉద్యోగ అవకాశాలు.. రూ.1425 కోట్ల పెట్టుబడితో ఈ యూనిట్ల ఏర్పాటు ద్వారా.. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో మనం చేసుకున్న ఎంఓయూలు కార్యరూపం దాల్చుతున్న మంచి ఘడియలు ఇవి" అని సీఎం జగన్ అన్నారు.

సీఎం జగన్ చొరవతో పరిశ్రమలు: మంత్రి కాకాణి

బయో ఇథనాల్ ఎనర్జీ ప్లాంట్స్ శంకుస్థాపన అనంతరం మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. మనం ఎన్నో ఏళ్లుగా ఈ పరిశ్రమల కోసం ఎదురుచూస్తూ ఉన్నాము. ఈరోజు సీఎం వైఎస్ జగన్ గారి చొరవతో ఇక్కడ ఈ పరిశ్రమలకు శంకుస్థాపన చేసుకోగలిగాము. ఈ పరిశ్రమకు కావాల్సిన భూమిని సమకూర్చిన వారికి పరిహారం కూడా ఇచ్చాము. ఆ కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి పరిశ్రమ యాజమాన్యాలు సహకరించాలని ఈ సందర్భంగా వారిని కోరుతున్నాను.

రూ. 925 కోట్లతో నిర్మించనున్న ఈ రెండు బయో ఇథనాల్ ఎనర్జీ ప్లాంట్స్ పూర్తయితే స్థానికంగా ఉండే సుమారు 75 శాతం మంది యువతకు ఉపాధి కలుగుతుంది. క్రిబ్కో విశ్వ సముద్ర ప్రవేట్ లిమిటెడ్ అధ్వర్యంలో ఈ రెండు ప్లాంట్స్ ను కాలుష్యం లేకుండా ఉండేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుని నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు.

# అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో ప్రధాని మోదీ భేటీ

వెల్లడించారు. ఈ భేటీలో ఇరు దేశాధినేతలు ఆత్మీయ బంధాన్ని, స్నేహాన్ని మరింత బలోపేతం చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా భారత్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన సంగీత కార్యక్రమాన్ని స్టూడియో ధూమ్ అనే సంస్థ నిర్వహించింది.

ప్రధానికి ప్రత్యేక గిఫ్ట్‌లు..

ప్రధాని మోదీకి అమెరికా అధ్యక్షుడు బైడెన్ ప్రత్యేక కానుకలు ఇవ్వనున్నారు. 20వ శతాబ్దం ప్రారంభంలో పూర్తిగా చేతితో తయారు చేసిన పుస్తకం 'గ్యాలీ'ని, ఒక పురాత కెమెరాను, తొలి కొడాక్ కెమెరా కోసం జార్జ్ ఈస్ట్‌మన్‌కు జారీ చేసిన పేటెంట్ ఆర్కైవల్ కాపీ, అమెరికా వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ హార్డ్‌బుక్‌ను బైడెన్ బహూకరించనుండగా.. ప్రముఖ కవి రాబర్ట్ ఫ్రాస్ట్ సేకరించిన కవితల సైన్డ్ కాపీని జిల్ అందించనున్నారు.

## ఓటు వేసిన ప్రతిఒక్కరూ వైసీపీ ప్రభుత్వాన్ని నిలదీయాలి

ర్యాలీలో పాల్గొన్న పవన్?కల్యాణ్ అనంతరం ఉప్పాడ జంక్షన్?లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ హిందూ దేవాలయాను కూల్చడం దారుణమని విమర్శించారు. 'ఆంధ్రా నేలపై నిలబడి ఉంటా.. ఏ గూండా అయినా రండి. వైసీపీ గూండాలను చొక్కాలు తీసి కొడతాం. నేను పోరాడుతా.. తెగిస్తా. ఇసుక కాంట్రాక్టులతో వేల కోట్లు దోచేస్తున్నారు. ఏపీ క్రిమినల్స్ కు అడ్డాగా మారింది. ఎంపీ కుటుంబానికే దిక్కు లేదు. నన్ను సీఎంను చేయండి.. ఏపీని ఉన్నతంగా తీర్చిదిద్దుతా. నాకు మత పిచ్చి లేదు.. సనాతన ధర్మాన్ని గౌరవిస్తా. అమ్మవారి సాక్షిగా చెబుతున్నా నేను ఆంధ్రా విడిచి వెళ్లను. వైసీపీ ప్రభుత్వం మళ్లీ వస్తే ఎవరినీ బతకనివ్వదు.' అని పవన్?కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## దేశంలో ప్రధాని లేని సమయంలో సమావేశమా..? మండిపడ్డ కాంగ్రెస్

ఘర్షణలు ఆగడం లేదు. ఇదిలా ఉంటే.. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని అమెరికాలో ఉన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఐరాస వేదికగా యోగా కార్యక్రమానికి నేతృత్వం వహించారు. అలాగే అగ్రదేశంతో పలు ఒప్పందాలు కుదుర్చుకునే పనిలో ఉన్నారు.

# విజేతలకు అభినందన

శ్రీకాకుళం, : శ్రీకాకుళం పట్టణంలోని ఎన్ టి ఆర్ మునిసిపల్ హైస్కూల్ విద్యా ప్రమాణాలు మెరుగవుతున్నందుకు వక్తలు హర్షం వ్యక్తం చేశారు. 2022-23 విద్యాసంవత్సరంలో శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోవున్న ప్రభుత్వ పాఠశాలల్లో, 10వ తరగతి పరీక్షల్లో ఈపాఠశాల రెండవస్థానం సాధించిందని, ఉత్తమ మార్కులు సాధించి నవారిలో, ఈపాఠశాల విద్యార్థిని కొత్తకోట తేజస్విని 587 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిందని పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షులు వి.జి.కె.మూర్తి, ప్రధాన కార్యదర్శి జామి భీమశంకరరావులు పేర్కొంటూ విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపకబృందాన్ని అభినందించారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో తేజస్వినితో బాటు, పాఠశాలలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన డి.వి.ఎం.సుధీర్ , ఉంగటి చాందిని లను అభినందించి బహుమ తులను ప్రశంసాపా పత్రాలను అందజేశారు.

# జీఈ-ఏరోస్పేస్‌తో హెచ్.ఎ.ఎల్. కీలక ఒప్పందం..

## ఇక భారత్‌లోనే ఫైటర్ జెట్ ఇంజిన్ల తయారీ



వాషింగ్టన్: భారత్- అమెరికా మధ్య కీలక ఒప్పందం కుదిరింది. దేశీయంగా ఫైటర్ జెట్ ఇంజిన్ల తయారీకి జీఈ ఏరోస్పేస్‌తో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ కీలక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఇంజిన్లను భారత వాయుసేనకు చెందిన తేజస్ మార్క్-2 యుద్ధవిమానాల్లో అమరుస్తారు. ప్రధాని మోదీ అమెరికా పర్యటన వేళ ఈ నిర్ణయం వెలువడింది.

జీఈ ఏరోస్పేస్‌కు చెందిన ఎఫ్414 ఇంజిన్లను హెచ్ఏఎల్‌తో కలిసి భారత్‌లో తయారు చేసేందుకు ఒప్పందం కుదిరిందని ఆ కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. దీనికి సంబంధించి అమెరికా ప్రభుత్వం నుంచి కావాల్సిన ఎగుమతి అనుమతులను తీసుకోనున్నట్లు పేర్కొంది. హెచ్ఏఎల్‌తో కుదుర్చుకున్న ఈ ఒప్పందాన్ని భారత్-అమెరికా మధ్య రక్షణ భాగస్వామ్యంలో కీలక ముందడుగుగా అభివర్ణించింది. దీన్నోక చారిత్రక ఒప్పందంగా జీఈ ఏరోస్పేస్ ఛైర్మన్, సీఈఓ లారెన్స్ కల్ప్ జూనియర్ పేర్కొన్నారు.

ఈ ఒప్పందం దేనికి?

గగనతల పోరాటంలో ఫైటర్ యుద్ధవిమానాలే రారాజులు. వాటికి గుండెకాయ లాంటిది అందులోని జెట్ ఇంజిన్. జెట్ ఇంజిన్ల తయారీ పరిజ్ఞానం అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, రష్యాల వద్ద మాత్రమే ఉంది. దాన్ని ఇతర దేశాలకు బదలాయించడానికి అవి అంగీకరించడం లేదు. రక్షణ పరిజ్ఞానానికి సంబంధించి ఇప్పటివరకూ అనేక అంశాల్లో భారత్ స్వయంసమృద్ధి సాధించినప్పటికీ.. జెట్ ఇంజిన్ విషయంలో మాత్రం పురోగతి లేదు. దేశీయంగా అభివృద్ధి చేసిన తేజస్ యుద్ధ విమానం కోసం 'కావేరి' ఇంజిన్ ప్రాజెక్టును 1986లో ప్రారంభించింది. ఇందుకు రూ.వేల కోట్లు వెచ్చించినా ఆ ఇంజిన్ ఆశించిన స్థాయిలో పనిచేయలేదు. దీంతో తేజస్ యుద్ధవిమానాల కోసం జనరల్ ఎలక్ట్రిక్ నుంచి జీఈ-ఎఫ్404 ఇంజిన్లను దిగుమతి చేసుకుంది. ఇప్పటికే 75 ఎఫ్404 ఇంజిన్లు దేశానికి చేరాయి. మరో 99 ఇంజిన్లు రావాల్సి ఉంది. మరోవైపు 8 ఎఫ్ 404 ఇంజిన్లు భారత్‌కు చేరాయి. తాజా ఒప్పందం ప్రకారం.. ఇకపై వీటిని దేశీయంగా తయారు చేయనున్నారు. ఈ ఒప్పందం వల్ల భారత్‌లో భారీగా కొత్త ఉద్యోగాలు వస్తాయి. ఇంజిన్ల తయారీకి సంబంధించిన పరిజ్ఞానమూ భారత్‌కు బదిలీ చేసే అవుతుంది.

**ఇవీ జీఈ-ఎఫ్414 ప్రత్యేకతలు..**

జీఈ-ఎఫ్404 ఇంజిన్ కన్నా జీఈ-ఎఫ్414 శక్తిమంతమైంది. పాతబడిపోతున్న మిరాజ్-2000, మిగ్-29, జాగ్వార్ యుద్ధవిమానాల స్థానంలో ప్రవేశపెట్టే తేజస్ మార్క్-2 యుద్ధవిమానంలో దీన్ని అమరుస్తారు.

ఎఫ్414 ఇంజిన్.. 1970లలో అభివృద్ధి చేసిన ఎఫ్404 ఇంజిన్‌కు సంబంధించిన కొత్త వెర్షన్. దీని ప్రత్యేకతల దృష్ట్యా ఎఫ్/ఏ-18 సూపర్ హార్నెట్, ఈఏ-18జీ గ్రౌలర్ సహా అనేక యుద్ధవిమానాలకు దీన్ని ఎంపిక చేశారు.

ఎఫ్404 ఇంజిన్ 90 కిలోన్యూటన్ల శక్తిని ఉత్పత్తి చేస్తుంది. జీఈ-ఎఫ్414 ఇంజిన్ దాదాపు 98 కిలోన్యూటన్ల శక్తిని వెలువరిస్తుంది.

'ఎఫ్414కు' తిరుగులేని విశ్వసనీయత ఉంది. ఈ ఇంజిన్లు అమర్చిన విమానాలు కోటి గంటలు గగనవిహారం చేశాయి.

వీటి నిర్వహణ చాలా సులువు. అందువల్ల ఖర్చులు తగ్గుతాయి.

ఫుల్ అథారిటీ డిజిటల్ ఇంజిన్ కంట్రోల్ (ఎఫ్ఏడీఈసీ) వ్యవస్థ కలిగిన మొదటి ఫైటర్ ఇంజిన్ ఇదే. దీనివల్ల ఇంజిన్ పనితీరును అత్యంత కచ్చితత్వంతో నియంత్రించడానికి వీలవుతుంది. ఇంధన సమర్థత పెరుగుతుంది. ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రానిక్ ఇంజిన్ ఇన్‌స్ట్రుమెంటేషన్ (ఐఈఈ) కలిగిన తొలి జెట్ ఇంజిన్ కూడా ఇదే. దీనివల్ల ఇంజిన్ పనితీరుపై రియల్‌టైమ్ డేటా అందిస్తుంది.

# సైన్స్ అవార్డుల రద్దు చేయడం శాస్త్ర పురోగతికి అడ్డుకట్ట వేయడమే : జెవివి

విజయనగరం, **(విజయభాను న్యూస్)** : సైన్స్ అవార్డుల రద్దు చేయడం శాస్త్ర పురోగతికి అడ్డుకట్ట వేయడమేనని జనవిజ్ఞాన వేదిక విజయనగరం జిల్లా ప్రధానకార్యదర్శి పి.రమణప్రభాత్ అన్నారు. శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు సైన్స్, హెల్త్ రంగాలలో అవార్డులను నిలిపి వేయాలని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ తీసుకున్న నిర్ణయం సరికాదని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని జనవిజ్ఞాన వేదిక డిమాండ్ చేస్తోందని గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. యువ శాస్త్రవేత్తలకు, అంతర్జాతీయ హోదా కలిగిన శాస్త్రవేత్తలకు, సైన్స్ టీచర్లకు ఇచ్చే 72 అవార్డులను రద్దు చేయడం అంటే వారు తమ రంగాలలో చేసిన కృషికి కనీస గుర్తింపు లేకుండా వారిని అవమానించడమేనని అన్నారు. ఇలాంటి చర్యల ద్వారా శాస్త్రీయ సంస్థల స్వయం ప్రతిపత్తిని లాగేసుకొని తాము చెప్పినట్లు వినే కీలుబొమ్మని చేయాలనేదే కేంద్ర ప్రభుత్వం ఆలోచనని విమర్శించారు. బడ్జెట్లో శాస్త్ర సాంకేతిక రంగాలకు నిధుల కోత మనం చూస్తూనే ఉన్నామని, ఇప్పటికే భారత ప్రభుత్వం డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నడుస్తున్న విజ్ఞాన్ ప్రసార్ సంస్థను భారత ప్రభుత్వం మూసేయాలనే నిర్ణయం తీసుకుందని, మరి ఇలాంటి చర్యలు పాలకులు తీసుకుంటూ దేశం ప్రగతి పథాన నడుస్తోందని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. పాఠ్యాంశాలలో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని, పీరియాడిక్ టేబుల్ లాంటి అంశాలను తొలగించడం విద్యార్థు లకు శాస్త్రీయ అంశాలను తెలియపర చకూడదనే భావన పాలకులలో రావడం, మరోవైపు అశాస్త్రీయ అంశాలైన జ్యోతిష్యం, వాస్తు మొదలగు అంశాలను పాఠ్యాంశాలలో చొప్పించడం తిరోగమన చర్యకు నిదర్శనం అని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రజలకు క్రమబద్దంగా, ప్రణాళి కాబద్ధంగా శాస్త్రీయతను దూరంచేసి వాటిస్థానంలో తమ భావాజాల, సైద్ధాంతికను అందించాలనే విషవిద్వేష రాజకీయ ఆలోచనలో భాగంగానే సైన్స్ అవార్డుల రద్దు జరిగిందనే విషయం ప్రజలు గుర్తించాలని, ఇలాంటి చర్యలను మేధావులు, శాస్త్రవేత్తలు, శాస్త్ర ప్రచార సంస్థలు ఖండించాలని జనవిజ్ఞాన వేదిక విజ్ఞప్తి చేస్తోందని అన్నారు.

# చోడవరంలో ఘనంగా జగన్నాథ స్వామి దశ అవతార మహోత్సవాలు

## – కూర్మావతార అలంకరణలో స్వామి దర్శనం



బలబద్ర, సుభద్ర సమేతంగా కూర్మావతారంలో దర్శనమిచ్చిన జగన్నాథ స్వామి

చోడవరం,(విజయభాను న్యూస్) : చోడవరం పట్టణంలోని కేశవ స్వామి వారి దేవాలయం ప్రాంగణం, జగన్నాథ స్వామి దశ అవతార మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా రెండవ రోజు గురువారం కూర్మావతారం అలంకరణలో జగన్నాథ స్వామి వారు భక్తులకు దర్శించారు. స్వామివారికి ఉదయం సాయంత్రం ప్రత్యేక అర్చనలతో పాటు, పూజలు, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, విశేష హారతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ వాసులతో పాటు, పరిసర గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

# డైట్ లో ప్రపంచ వర్షారణ్యాల దినోత్సవం



భీమునిపట్నం, విజయభాను న్యూస్ : పర్యావరణంలో మొక్కలు కాపాడడం మన బాధ్యత అని, వర్షారణ్యాలు అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందని డైట్ ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్ అన్నారు. గురువారం డైట్ లో ప్రపంచ వర్షారణ్యాల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు శాతం వర్షారణ్యాలు, 50 శాతం మనుషులు జంతువులు ఈ భూగోళాన్ని ఆక్రమించి ఉన్నారని, భూమి అవసరాలు ప్రస్తుతం మొక్కలు తీర్చుజాలని పరిస్థితికి తీసుకు వస్తున్నామని, అందుచేత ఈ సంవత్సరపు వర్షారణ్య దినోత్సవ ముఖ్యాంశమైన సంరక్షించు పునరుత్పత్తి చేయు అని ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారని ఉన్న వాటిని సంరక్షిస్తూ,పునరుద్ధరిస్తూ, పునరుత్పత్తి చేస్తూ ప్రపంచంలో పచ్చదనం పెరిగేటట్టు చేయాలని అన్నారు. సైన్స్ అధ్యాపకుడు షేక్ అల్లావుద్దీన్ మాట్లాడుతూ శరీరంలో ఊపిరితిత్తులు మన శ్వాసను ఏ రకంగా శుభ్రపరుస్తుందో అదే విధంగా ప్రపంచ వాతావరణము పరిశుభ్రపరిచే చెట్లుకు నిరంతరం మనం తోడుగా ఉండేటట్లు చేయాలని అన్నారు. ఛాత్రోపాధ్యాయులు వర్షారణ్య దినోత్సవ నినాదా లతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎం మహాలక్ష్మి గోట్టేటి రవి, సిఏ సోమయాజులు, జె. మాధవి, షేక్ అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు కు నష్ట పరిహారం ఇచ్చిన తరువాత పనులు చేయాలి

**రెండో రైల్వే లైన్ వలన నష్ట పోయిన రైతులు అందించిన తరువాత పనులు ప్రారంభించాలి..**



అనంతగిరి విజయభాను న్యూస్ : టోకూరు పంచాయతీ దొరగుడ కొత్తవలస బలియగుడ బిడ్జీ కంబవలస గ్రామాల్లో రెండో రైల్వే లైన్ వల్ల నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు గురువారం రైల్వే లైన్ నిర్మిస్తున్న కాంట్రాక్టు రైతులతో కలిసి కాపీ మిరియాల తోటలు పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టా లేకున్నా సాగులో ఉన్న ప్రతి ఒక్కరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గెమ్మెల దేవన్న సబ్ కాంట్రాక్ట్ వెంకటేష్ రైతులు గెమ్మెల లక్ష్మణ రావు గెమ్మెల మల్లన్న తామల చిన్నయ్య గెమ్మెల కన్నయ్య పండన్న నీలన్న రమణ బుజ్జిబాబు పూజరి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు

# గడపగడప కార్యక్రమంలో ఎమ్మెల్యే అదీప్‌రాజు



పరవాడ (విజయభాను న్యూస్) : జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెం సచివాలయం 387 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లో పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు.. జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందుతున్నాయో లేదో పర్యవేక్షించారు.. రాష్ట్ర బుద్ధి జగన్మోహన్ రెడ్డితో సాధ్యపడుతుందని, ముఖ్యమంత్రిగా మరొకసారి అవకాశం ఇవ్వాలని కోరారు.. ఈ కార్యక్రమంలోఎమ్మెల్యే అదీప్ రాజ్ తో పాటు 79 వ వార్డు అధ్యక్షులు అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, కాసు అంజి రెడ్డి, కర్రీ వినోద్ కుమార్,పూర్ణానంద శర్మ, రవి,పందురి రమణ , రెబెకా నరేష్, కల్యాణి,ఎల్లపు ప్రసాద్,నర్సింగ్, కిషోర్, యు సి డి ఏ పి డి రాము, వాటర్ సప్లై ఏ ఈ రాజ్ కుమార్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఓయ్ స్టార్ స్కూల్లో యోగా దినోత్సవ వేడుకలు



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ భరిణకు మధ్యలో గల ఓయ్ స్టార్ స్కూల్లో యోగ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ అరోగ్యం లభిస్తుందని పేర్కొన్నారు.. యోగా ద్వారా శారీరకంగా,మానసికంగా, సంపూర్ణ ఆరోగ్యంగా, చురుకుగా ఉంటామని అన్నారు. ప్రతి రోజు వ్యాయామం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం విద్యార్థుల చేత యోగా సనాలు చేయించారు.. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కూర్మ అవతారంలో జగన్నాథుడు



భీమునిపట్నం, విజయభాను న్యూస్ : స్థానిక శ్రీ జగన్నాథ స్వామి ఆలయ ఇద్రజమనం లో మందిరం జగన్నాథుడు గురువారం కూర్మ అవతారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అత్యధిక సంఖ్యలో ప్రజలు కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరీ



కంబాల జోగులు

రాజాం (విజయభాను న్యూస్) : రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ. 1.48 కోట్లు నిధులు మంజూరీ అయ్యాయని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు గురువారం వెల్లడించారు. ప్రస్తుతం మున్సిపల్ శాఖ భవన సముదాయం వద్ద ఆర్టీసీ బస్టాండ్ కొనసాగుతుందని, పక్కా భవనాలతో పాటు విశ్రాంతి భవనాల సముదాయంతో కొత్త ఆర్టీసీ కాంప్లెక్స్ ను ప్రభుత్వ స్థలంలో రైతు బజారు పక్కన నిర్మించనున్నట్లు తెలిపారు. ఈమేరకు ఏపీఎస్ఆర్టీసీ శాఖ నిధులు విడుదలను ధ్రువీకరించిందని అన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చొరవతో నిధులు త్వరితగతిన మంజూరీ అయ్యాయని పేర్కొన్నారు.

# కూర్మావతారంలో శ్రీ జగన్నాథుడు



అక్కయ్యపాలెం, (విజయభాను న్యూస్) : .స్థానిక టర్నర్ సత్రంలో జరుగుతున్న శ్రీ జగన్నాథ స్వామి వారి రథయాత్రలో భాగంగా గురువారం శ్రీ జగన్నాథుడు కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు ఉదయం శ్రీ స్వామివారికి మేలుకొలుపు, నాదస్వరం, నిత్యపూజ,లలిత సహస్రనామార్చన జరిగింది. ప్రత్యేక పూజలు నిర్వహించారు మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్వామివారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఫెస్టివల్ ఆఫీసర్, దేవదాయ శాఖ ఏసీ కె. శిరీష, ఈఓ టి. రాజగోపాల్ రెడ్డి పర్యవేక్షణలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం శ్రీ జగన్నాథ స్వామి వారు వరాహవతారంలో భక్తులకు దర్శనమిస్తారు.

# శ్రావ్యంగా స్వర గీతికలు



విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : స్వర గీతిక సాంస్కృతిక సంగీత సంస్థ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం విశాఖ పౌర గ్రంధాలయంలో ఎన్టీఆర్, ఏఎన్ఆర్ చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఇందులో రాజారావు, లయ పాడిన చేయి చేయి తగిలింది, బొమ్మిడి సత్య నారాయణ, రమణి పాడిన రేపంటి రూపం కంటి, మహ్మద్ ఖాన్, సుజాత పాడిన నాకళ్ళు చెబుతున్నాయి, రాంబాబు, ఆదిలక్ష్మి పాడిన కోలో కోలోయన్న, వెంకటేష్‌మాస్టర్, మను పల్లా పాడిన వయసు ముసురు కొస్తున్నది, న్యాయవాది ఎస్ ఎస్ఎన్ రాజు, మాధురి పాడిన రవి వర్మకే లోకేష్, లోకేష్ పాడిన సంభవం నీకేసంభవం, వివిఎన్ మూర్తి, శ్రీదేవి పాడిన పంచమి పూట మంచిదని, కెఎల్ రావు,

జాస్మిన్ పాడిన చిరునవ్వుల, వంటి ప్రజాదరణ పొందిన గీతాలు ఆలపించి రస హృదయాలను మైమరపింపజేశారు. తొలు త వివిధ కళా సంస్థల ప్రతినిధులు ఫణి స్వామి, వెంకటేష్ మాస్టర్, చెన్నా తిరుమల రావు, శివ సాయి గోపాలరావు, సన్‌మూర్తి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

– జెఎస్ ప్రసాద్, పీఆర్ఓ

# అచ్యుతాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : సమస్యలు పరిష్కారానికే సీఎం జగన్మోహన్ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారని యలమంచిలి ఎమ్మెల్యే యు వి రమణమూర్తి రాజు అన్నారు . గురువారం మండల కేంద్రమైన అచ్యుతాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే యు వి రమణమూర్తిరాజు , మాజీ డిసిసిబి చైర్మన్ యు సుకుమార వర్మతో కలిసి గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గడప గడపకు మన ప్రభుత్వం విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, జడ్పిటిసి లాలం రాంబాబు, కోజడ్పిటిసి నర్మాల కుమార్, మండల పార్టీ అధ్యక్షులు దేశంశెట్టి శంకరరావు, సర్పంచ్ కూండ్రపు విమలా నాయుడు, మాజీ ఎంపీపీలు చేకూరి శ్రీనివాస రాజు, వడిశల శ్రీనివాసరావు, కో ఆప్షన్ ఎంపీటీసీ చేపల శ్రీరాములు, వైసిపి నాయకులు రెడ్డి శ్రీను, మాజీ వైస్ ఎంపీపీ ఉమ్మిడి అప్పారావు, సర్పంచ్ లు పిన్నంరాజు వాసు, లాలం వాణి శ్రీనివాసరావు, సియాద్రి బుజ్జి, రాజాన నాయుడుబాబు, ఎంపీటీసీలు లాలం శ్రీను , శనివాడ జువ్వాలనాయుడు, రావి నాగలక్ష్మి శోభన్ బాబు, సచివాలయ కన్వీ ర్ తోట వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.

# బహుళ ప్రయోజన సామాజిక భవనం ప్రారంభం



గాజువాక (విజయభాను న్యూస్) : జీవీఎంసీ 87వ వార్డు కణితి ఏకల్యవ వీధి – 1 లో 69 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన బహుళ ప్రయోజన సామాజిక భవనాన్ని గురువారం గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతు గాజువాక నియోజకవర్గం పరిధిలోని అన్ని వార్డుల్లోని పార్కులు, రోడ్లు, డ్రెయిన్స్, సామజిక భవనాలు, స్మశానవాటికల్లో అభివృద్ధి పనులు శరవేగంతో జరుగుతున్నాయని అన్నారు. నిర్వాసితుల కాలానీల్లో ప్రజల సౌకర్యార్థం, బహుళ ప్రయోజన సామాజిక భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు. రానున్న రోజుల్లో అన్ని కాలానీల్లో ఈ సదుపాయల్ని కల్పిస్తామని చెప్పారు. వడ్లపూడిలో నిర్మాణం పూర్తైన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా త్వరలోనే ప్రారంభించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిచటం జరుగుతుందని అని అన్నారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో, వడ్లపూడి కణితి రోడ్ నిర్మాణం కొరకు ప్రణాళికలు పూర్తి చేయటం జరిగిందని, త్వరలోనే రోడ్ నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో 87వ వార్డు వై.యస్.ఆర్.సీ.పీ ఇంచార్జ్ కోమటి శ్రీనివాస రావు,ఈ.ఈ కుప్పిలి ప్రసాదబాబు, ఏ.ఇ తులసి, వై.యస్.ఆర్.సీ.పీ నాయకులు శీరపు పాపారావు, దాసరి అప్పుడు,చిత్రాడ వెంకట రమణ, బొడ్డు గోవింద్,కోమటి రమాదేవి, ఎన్నేటి రమణ, ప్రగడ వెనుబాబు, సత్తిబాబు, శీరపు కనకరాజు, శీరపు రమణ,వండ్రాసి సన్యాసిరావు,దుగ్గపు దానప్పలు, బోండ గోవిందరాజులు, ముద్దపు దామోదర్ సచివాలయ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు నమోదు చేయాలి

## నర్సీపట్నం ఆర్డీవో జయరాం

గొలుగొండ, విజయభాను న్యూస్ : 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు నమోదు చేయాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యా లయంలో ఏర్పాటు చేసిన బిఎల్‌వోల సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ, బిఎల్‌వోలు తమ పరిధిలో ఉన్న ఓటర్ జాబితాను సరి చూసుకొని జనాభా పరిమితిలో ఓట్లు ఉన్నవి లేనివి పరిశీలించాలన్నారు. డెత్‌లను, డబల్ ఎంట్రీలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి. ఆనందరావు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## ఖరీఫ్ సన్నద్ధత ఏదీ?

ఈ మారు తొలకరి పలకరింపు ఆలస్యమైంది. జూన్ మూడవ వారానికీ వర్షాల్లేక ఏరువాక కదల్లేదు. ఖరీఫ్ సేద్యానికి అదను పదును తప్పేలా ఉంది. తుపాన్లు, వరదలు, అకాల వానలు, వర్షాభావం నిరుడు ఖరీఫ్ రైతుల ఉసురు తీశాయి. పంటలకు ధర సమస్య తిష్ట వేసింది. ప్రభుత్వ నిర్లిప్తత, నిర్లక్ష్యం ఉండనే ఉన్నాయి. ఈ తడవైనా ఖరీఫ్ పంటలు వేయబోతే ఆదిలో హంసపాదులా నైరుతి రుతుపవనాలు ఆలస్యమయ్యాయి. సీజన్‌లో 21 రోజులు గడిచినా మబ్బు జాడ లేదు. ఆ ప్రాంతం ఈ ప్రాంతం అని లేకుండా అధిక ఉష్ణోగ్రతలు, వడగాలులు, ఉక్కపోతలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికి పడాల్సిన సాధారణ వర్షంలో 61 శాతానికిపైన తక్కువ పడింది. చిత్తూరు మినహా అన్ని జిల్లాలూ 50-80 శాతం వర్షపు లోటు ఎదుర్కొంటున్నాయి. ఎ.పి.లో 679 మండలాలుండగా 527 చోట్ల తక్కువ వర్షం పడింది. 11 మండలాల్లో చినుకు లేదు. 91 మండలాల్లో మాత్రమే నార్మల్, అంతకంటే కొంచెం వర్షం కురిసింది. ఈ గణాంకాలు ప్రభుత్వానివి. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు భయంకరంగా ఉన్నాయి.

వ్యవసాయ రాష్ట్రం ఎ.పి.కి ఖరీఫ్ కీలకమైనది కాగా రానురాను రైతులకు సీజన్ భారంగా కష్టంగా తయారైందని సాగు లెక్కలు తెలుపుతున్నాయి. గతేడాది నిర్ణయించుకున్న సాధారణ సాగు విస్తీర్ణంలో ఐదున్నర లక్షల ఎకరాల్లో విత్తనం పడక బీడు పడ్డాయి. రబీలోనూ పది లక్షల ఎకరాల్లో పంటల్లేక ఖాళీ పడ్డాయి. క్రమేపి సాగు తగ్గుతుండటంతో నిర్ణయించుకునే నార్మల్ సాగు అంచనాలూ తగ్గిపోతున్నాయి. ఉదాహరణకు నిరుడు ఖరీఫ్ కంటే ఈ సారి ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం ఆరు లక్షల ఎకరాలు పడిపోయింది. ఒక్క సంవత్సరంలో అన్నేసి లక్షల ఎకరాల తగ్గుదల ఆందోళన కలిగిస్తుంది. రాయలసీమలో వేరుశనగ విస్తీర్ణం తగ్గి పత్తి, ఇతర వాణిజ్య పంటలు పెరుగుతున్నాయి. ధాన్యాగారాలైన గోదావరి, కృష్ణా, పెన్నా డెల్టాలలో వరి కుదించుకుపోయి ఆక్వా, ఇతర కమర్షియల్ క్రాప్స్ వేస్తున్నారు. ఈ ధోరణులు ప్రభుత్వాల విధానాల పర్యవసానాలు. ఏ పంట వేసినా పెట్టుబడులకు కనీస గ్యారంటీ లేనందున సేద్యం రైతులకు జూదాన్ని తలపిస్తోంది. అందుకే తలో దిక్కు పోయి చేతులు కాల్చుకొని నష్టపోతున్నారు. చివరికి చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతులతో స్వంత వ్యవసాయం మాన్పించి కార్పొరేట్ల చెప్పుచేతల్లోకి చేర్చే కుట్ర జరుగుతోంది. ఇది రైతాంగానికి ప్రజల ఆహార భద్రతకు ప్రమాదం.

ఖరీఫ్ సన్నద్ధతకు రాష్ట్ర ప్రభుత్వం అంతగా ప్రాధాన్యత ఇవ్వనట్లే కనిపిస్తోంది. పంటలేయాలంటే రైతులకు కావాల్సినవి అదనకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పరపతి, సాగునీరు. వర్షాలు పడలేదు కాబట్టికానీ, లేకపోతే విత్తనాల కోసం వెదుకులాటే. రాయితీ వేరుశనగ విత్తన పంపిణీని మమ అనిపించారు. ఇండెంట్ బాగా తగ్గించారు. వరి, ఇతర పంటలదీ అదే తీరు. నిరుడు నకిలీ, కల్తీ మిర్చి విత్తనాలు, నారుతో రైతులు భారీగా నష్టపోయారు. పత్తి విత్తనాలూ అంతే. ఇప్పటి వరకు రైతులకు నష్ట పరిహారం అందలేదు. కాగా ఈ ఏడాది ఖరీఫ్ మొదలుకాకముందే చాలా చోట్ల నకిలీ విత్తనాలను సీజ్ చేశారు. పట్టుకున్నది గోరంత, పట్టుకోకుండా చెలామణి అవుతున్నది కొండంత. పురుగు మందుల అక్రమాలు చెప్పనలవికావు. నాణ్యత విషయంలో రాజీ లేదని ప్రభుత్వం హూంకరిస్తుండగా జరిగేది జరిగి పోతోంది. నిరుడు ఎరువుల సరఫరాలో అస్తవ్యస్తత వలన అదనుకు ఎరువులు దొరక్క రైతులు ఇబ్బందులు పడ్డారు. బ్యాంక్ రుణాల లక్ష్యాలు వందకు వంద శాతం చేరాయంటున్నా కౌలు రైతుల పరపతి అధమస్తంగా ఉంది. కేంద్ర బీమా పథకంలో చేరడంతో ఖరీఫ్ బీమా ఇంకా అందలేదు. అకాల వర్షాల బారిన పడ్డ రైతుల్లో చాలా మందికి పరిహారం దక్కలేదు. రైతు భరోసా చాలా మందికి పడలేదు. పి.ఎం కిసాన్ జాడ లేదు. కేలండర్ ప్రకారం కాల్వలకు నీళ్లొదులుతున్నామంటున్నా చివరి భూములకు అందట్లేదు. మరమ్మతుల్లేక కాల్వల్లో తగినంత నీరు పారట్లేదు. రిపేర్లు లేక చిన్న వానలకే డ్రైన్లు పొంగి పొలాలపై పడుతున్నాయి. శ్రీశైలం దగ్గరే రిపేర్లు లేవు. ప్రభుత్వం మాత్రం ఆర్‌బికెల జపం చేస్తోంది. ఏర్పాట్లు లేకుండా ఖరీఫ్ సజావుగా సాగదు. ప్రభుత్వం ఖరీఫ్ సన్నద్ధతపై దృష్టి నిలపాలి.

## ఇది 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గౌరవం : మోదీ



వాషింగ్టన్: ప్రజా ప్రయోజనాలు కాపాడటమే లక్ష్యంగా భారత్, అమెరికా ( పని చేస్తున్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఇరుదేశాల వ్యవస్థలు, సంస్థలు ప్రజాస్వామ్య పునాదులపై నిర్మించి ఉన్నాయని చెప్పారు. అమెరికాలో తనకు దక్కిన గౌరవం 140 కోట్ల మంది భారతీయులకు, 4 మిలియన్ల భారతీయ అమెరికన్లకు లభించిన గౌరవంగా భావిస్తున్నట్లు ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. అమెరికా పర్యటనలో ఉన్న మోదీ వివిధ రాష్ట్రాల్లో పర్యటించి తిరిగి వైట్‌హౌస్‌కు చేరుకున్నారు. ఆయనకు అమెరికా అధ్యక్షుడు బైడెన్ ( దంపతులు ఘనస్వాగతం పలికారు. ఆయనకు గౌరవ సూచకంగా సైనికులు 19 రౌండ్‌లు గాల్లోకి కాల్పులు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్తంగా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. 3 దశాబ్దాల క్రితం సామాన్యుడిగా అమెరికా పర్యటనకు వచ్చినట్లు గుర్తు చేసుకున్నారు. "నాడు వైట్ హౌస్‌ను బయట నుంచి చూశాను. ప్రధాని అయ్యాక పలుమార్లు అమెరికా పర్యటనకు వచ్చాను. తాజాగా పెద్ద ఎత్తున జన నీరాజనాలతో తొలిసారి వైట్‌హౌస్ ద్వారాలు తెరచుకున్నాయి. అమెరికాలో నివసిస్తున్న ఎన్‌ఆర్‌ఐలు దేశ గౌరవాన్ని ఇనుమడింపచేస్తున్నారు. భారతీయులు తమ నిబద్ధత, నైపుణ్యంతో దేశ గౌరవాన్ని పెంపొందించారు. కొవిడ్ విపత్తువేళ ప్రపంచం కొత్త రూపు సంతరించుకుంది. ఇరుదేశాల స్నేహం విశ్వ సామర్థ్యాన్ని పెంచేందుకు దోహదం చేసింది. ప్రపంచ ఆహారం కోసం ఇరుదేశాలు కలిసి పని చేసేందుకు కంకణబద్ధులై ఉన్నాయి. ఇరుదేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రజాస్వామ్య గొప్పతనానికి నిదర్శనం" అని మోదీ వ్యాఖ్యానించారు.

### భారత్-అమెరికా మధ్య బంధం చాలా గొప్పది : బైడెన్

భారత్, అమెరికా మధ్య బంధం చాలా గొప్పదని అమెరికా అధ్యక్షుడు బైడెన్ తెలిపారు. ఇరుదేశాల మధ్య సారూప్య విలువలు ఉన్నట్లు చెప్పారు. ఇరుదేశాల ప్రజల మధ్య ప్రత్యేక బంధం ఏర్పడిందన్నారు. రెండు గొప్ప దేశాలు, రెండు గొప్ప శక్తులు, ఇద్దరు గొప్ప స్నేహితులు 21వ శతాబ్ద గమనాన్ని నిర్వచించగలరని ఈ సందర్భంగా బైడెన్ వ్యాఖ్యానించారు. విశ్వాసమే మా ఇద్దరి మధ్య సంబంధాన్ని మరింత దృఢంగా తయారు చేసిందన్నారు. ప్రపంచ పరిస్థితుల దృష్ట్యా భారత్-అమెరికా కలిసి పని చేయడం చాలా అవసరమని బైడెన్ అన్నారు. పేదరిక నిర్మూలన, వాతావరణ మార్పులను పరిష్కరించడం, ఆరోగ్య సంరక్షణ, ఆహార భద్రత తదితర అంశాల్లో ఇరుదేశాలు కలిసి పని చేస్తున్నాయని గుర్తు చేశారు.

అమెరికన్ల జీవితాల్లో ఇండో అమెరికన్లు భాగస్వామ్యమైనట్లు స్పష్టంగా కనిపిస్తోందని బైడెన్ తెలిపారు. వారు ఇరు దేశాలకు వారధి లాంటివారని అన్నారు. వైట్‌హౌస్‌లోనూ, కాంగ్రెస్‌లోనూ ఇది స్పష్టంగా కనిపిస్తోందన్న ఆయన.. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అందుకు చక్కని ఉదాహరణ అని చెప్పారు. సాంకేతిక రంగంలో చాలా మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఈ నేపథ్యంలో సామాజికంగా, ఆర్థికంగా తీసుకున్న నిర్ణయాలే భవిష్యత్‌ను నిర్ణయిస్తాయని బైడెన్ తెలిపారు. ప్రజాస్వామ్య దేశాలుగా ఆర్థిక భాగస్వాములు ఆకర్షించే అవకాశం ఇరు దేశాలకూ ఉందని ఆయన అన్నారు.

## నాణ్యత ప్రమాణాలు పాటించాలి : మున్సిపల్ చైర్మన్ గిరిబాబు



పలాస (శ్రీకాకుళం) : రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఇష్టాను సారంగా రోడ్డు పనులు చేపడితే బిల్లులు చెల్లిం చడం కుదరదని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు రోడ్డు కాంట్రాక్ట ర్లను హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని పెసరపాడు, అంతరకుడ్డ కలుపుతూ మున్సిపల్ జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సహాయం నిధులతో నిర్మాణం చేపడుతున్న తారు రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలిం చారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లా డుతూ.. తారు రోడ్డు పనులు ఎంత వరకు చేపట్టారు.. ఇంకా ఎంత శాతం పనులు చేయాల్సి ఉంది తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసు కున్నారు.

అనంతరం పెసరపాడు గ్రామ సమీపంలో తారు రోడ్డు పనుల్లో భాగంగా పంట భూములకు వెళ్లాల్సిన సాగు నీరు కాలువ పాడైందని, ఖరీఫ్ సమయంలో సాగునీరు కోసం ఇబ్బంది తప్పదని వాటిని తక్షణమే బాగుచేసి పంట భూములకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత రైతులు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ ఖరీఫ్ నాటికి కాలువ పనులు చేపట్టి సాగునీరు అందేలా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్, వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, కౌన్సిలర్ ప్రతినిధి దువ్వాడ రమణయ్య, కో ఆప్షన్ సభ్యులు రోణంకి శ్రీనివాసరావు, మొదలవలస మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

# కవి సమయం

## 'నిషేధం - నిశ్శబ్దం'

జౌరారా సిద్ధూ! ఓరేరే సిద్ధూ
వినరా! .. వినరా సిద్ధూ!
ఈ సింగినాదం... సింధిగ్గం
వినరా!.. వినరా సిద్ధూ
సిద్ధూ.. సిద్ధూ... సిద్ధూ!
ధూమపాన నిషేధపు చమక్కులు
వినార!.. వినార సిద్ధూ!
పొగాకు పండించేవాడికి లేదంటరా!
నిషేధం... సిద్ధూ! ...॥జౌ॥
పొగాకు సంబంధిత పదార్థాలు
అమ్మేవారికి లేదంటరా!
నిషేధం.. సిద్ధూ!
ధూమపానం పదార్థాలు సేవించే వారికి
ఉందంటరా!
నిషేధం... సిద్ధూ!
రైల్లో.. బస్సుల్లో పొగాకు పదార్థాలు
సేవించరారంటరా
నిషేధం... సిద్ధూ!
బహిరంగ ప్రదేశాలలో పొగత్రాగరాదంటరా!
నిషేధం.. సిద్ధూ!
...॥జౌ॥
బ హిరంగ ప్రదేశాలలో పొగత్రాగరాదంటరా!
నిషేధం... సిద్ధూ!
పొగ త్రాగాలనుకుంటే;
లేవంట్రిన్‌లలో తల్పులు బడాయించి
త్రాగి - తాగి రక్తం క్రక్కి.. క్రక్కి చచ్చినా తప్పా!
నీలాంటి పొగ త్రాగే సిద్ధు లేదందరు చచ్చినా
తప్పా
పొగాకు నిషేధం లేదు రా సిద్ధూ!
ఇది ఓ జనాభా నియంత్రణే సిద్ధూ!
ప్రభుత్వ జనాభా నిండేదెలా సిద్ధూ!
...॥జౌ॥

... రచయిత
ఎల్ సిద్ధు

# పంచాంగం

మాసం : ఆషాడ ; తిథి: పంచమి సా.4.48; మఖ రా.తె.4.57; వ.మ.2.38ల 4.24.

**శుక్రవారం 23-06-2023**

a **మేషం** : ఖర్చులు అధికం. కోపతాపాలు అధికంగా వుంటాయి. స్త్రీలు తొందరపాటుతనం వల్ల ప్రియ తములను దూరం చేసు కుంటారు. యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు. గతంలో మిమ్ములను విమర్శించిన వారే మీ సహాయం అర్థిస్తారు. పెద్ద హోదాలో ఉన్నవారికి పర్యటనలు అధికమవుతాయి. b **వృషభం** : దూర ప్రాంతాల నుంచి మంచి వార్తలు వింటారు. మీ ఉత్సాహాన్ని అదుపులో ఉంచుకోవటం శ్రేయస్కరం. వృత్తిపరమైన ఆటంకాలు క్రమంగా తొలగిపోగలవు. దంపతుల మధ్య సఖ్యతాలోపం, కలహాలు చోటు చేసుకుంటాయి. కొన్ని విషయాల్లో మీరెంత తెలివిగా వ్యవహరించినా ఫలితాలు భిన్నంగానే ఉంటాయి. c **మిథునం** : మిత్రులతో ఇష్టాగోష్ఠి చేస్తారు. తలపెట్టిన పనులు వేగవంత మవుతాయి. ప్రైవేటు, పత్రికా సంస్థల్లో వారికి మార్పులు వాయిదాపడతాయి. విదేశీ యత్నాలు వాయిదాపడతాయి. ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. భాగస్వామికుల మాటతీరు, కదలికలను ఎంతైనా మంచిది. బ్యాంక్ వ్యవహారాలలో మెళకవ వహించండి. d **కర్కాటకం** : ఆరోగ్య విషయమై తగు జాగ్రత్త అవసరం. నరముల బలహీనత, మనోధైర్యం వలన అనుకున్న పనులు పూర్తి చేస్తారు. శారీరక శ్రమ, అకాల భోజనం వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. ఉద్యోగస్తులకు పెండింగ్ పనులపై దృష్టి సారిస్తారు. ఆలయాలను సందర్శిస్తారు. స్టాక్ మార్కెట్ రంగాల వారి అంచనా నిరుత్సాహపరుస్తాయి. ఏ విషయంలోను హామీ ఇవ్వకుండా లౌక్యంగా దాటవేయండి. e **సింహం** : ప్రయాణ లాభం, ఆదాయానికి మించి ఖర్చులు చేస్తారు. శుభకార్యాలపై దృష్టి పెడతారు. మీ ఆలోచనలు ఫలిస్తాయి. రుణాలు చేస్తారు. పెండింగ్ వ్యవహారాలు పూర్తి చేస్తారు. f **కన్య** : కార్యలాభం, గృహ లాభం, శుభకార్యలాభం, మిత్రుల సహాయ సహకారాలు లభించును. విందు, వినోదాలు, దూర ప్రయాణాలు చేస్తారు. ఆలయ సందర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. కోర్టు వాదోపవాదాల్లో ప్లీడర్లు విజయం సాధిస్తారు. మీ శ్రీమతి సహాయం లేనిదే మీ సమస్యలు పరిష్కారం కావని గ్రహించండి. ఇతరుల మెప్పుకోసం శ్రమాధిక్యత, ఒత్తిడి ఎదుర్కొనవలసివస్తుంది. g **తుల** : చక్కని వ్యాపారాలు జరుగును. నూతన వస్తు, వస్త్ర లాభం, వాహన సౌఖ్యం కలుగును. చేయు వృత్తి వ్యాపారాలయందు అనుకూలత, దైవదర్శనం కలుగును. పత్రికా, ప్రైవేటు రంగాల వారికి ఆర్థిక ప్రగతితో కూడిన అవకాశాలు లభిస్తాయి. రవాణా రంగాలలోని వారికి చికాకులుతప్పవు. బంధువుల రాకతో గృహంలో సందడి కానవస్తుంది. పెట్టుబడుల విషయంలో పునరాలోచన చాలా అవసరం. h **వృశ్చికం** : ఆర్థిక లావాదేవీలు సంతృప్తిగా ఉండును. పాత రుణాలు వసూలు, శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి. వ్యాపారాల్లో నిలదొక్కుకోవటానికి మరింతగా శ్రమించవలసి ఉంటుంది. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. ప్లీడర్లకు, ప్లీడరు గుమస్తాలకు, వైద్యులకు అనుకూలత. i **ధనుస్సు** : బంధుమిత్రులతో విందు వినోదాల్లో పాల్గొంటారు. విద్యార్థులకు మిత్రబృందాల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది మెళకువ వహించండి. బ్యాంకు వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల మీ కృషికి తగిన ప్రతిఫలం ఉంటుంది. స్త్రీలతో అతిగా సంభాషించటం వల్ల అపార్థాలకు గురికావలసి వస్తుంది. j **మకరం** : వ్యవహారానుకూలత, నూతన కార్యాములకు శ్రీకారం చుడతారు. ధైర్యంగా ముందుకు వెళతారు. నూతన పరిచయాలు వలన లాభం కలుగును. పత్రికా సంస్థలలోని వారికి పనిభారం, విశ్రాంతి లోపం వంటి చికాకులు అధికం. నిర్మాణ పనులలో జాప్యం, అధిక వ్యయం వల్ల ఆందోళనకు గురవుతారు. రావలసిన ధనం వాయిదాపడుట వల్ల ఆందోళనకు గురవుతారు. k **కుంభం** : వృత్తి వ్యాపారాలు అనుకూలించిననూ కోపం అధికం వలన అందరితోను విరోధాలు, మీ మాట లెక్కచేయకుండుట, శరీర అలసట, అధిక ధనవ్యయాలు, వృత్తి వ్యాపారాలు అనుకూలించిననూ కోపం అధికం వలన అందరితోను విరోధాలు కలుగును. l **మీనం** :యశోభూషణ ప్రాప్తి, నూతన పరిచయాలు లాభించును. శుభాలుక ధనవ్యయం, విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆర్థిక లావాదేవీలు సంతృప్తి, ధైర్యంతో కూడిన పనులు చేస్తారు.

# దేవ దేవుడు.. శ్రీ వేంకటేశుడు



**వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి**

బ్రహ్మాండంలో వేంకటాద్రికి సమానమైన పుణ్యక్షేత్రం లేదు. అలాగే శ్రీనివాసుడికి సాటిరాగల దేవుడు ఇటు భూతకాలంలో కానీ.. అటు భవిష్యత్తులో కానీ మరెవరూ ఉండరు... ఇదీ శ్లోకానికి అర్థం.

తిరుమల పుణ్యక్షేత్రం కలియుగ టళికుంఠమని ప్రసిద్ధి. ఈ ప్రశస్తికి మూలకారణం.. స్వయం వ్యక్త స్వరూపంలో వెలిసిన శ్రీవేంకటేశ్వరుడు. తిరుమలగిరిపై పవిత్రాద్భుతమైన ఒక సాలగ్రామశిల ద్వారా స్వయం భూగా వెలసిన శ్రీ వేంకటేశ్వరుణ్ణి శ్రీనివాసుడని, సప్తగిరీశుడని, ఏడుకొండలవాడని, బాలాజీ, తిరుమలప్ప, తిమ్మప్ప అని.. ఇలా ఎన్నో పేర్లతో భక్తజనులు ఆర్తిగా సంబోధిస్తూ ఉన్నారు. ఆనందనిలయుడె%న శ్రీవారు నెలకొన్న బంగారు మందిరానికి ఆనంద నిలయమనే వ్యవహారం అనాదిగా ప్రసిద్ధమై ఉంది.

**స్థలపురాణం**

కలియుగారంభంలో... అనగా సుమారు 5వేల సంవత్సరాల క్రితం.. వక్ష స్థల మహాలక్ష్మి సమేతంగా ఆవిర్భవించిన శ్రీనివాసునికి తరతరాలుగా ఎందరో భక్తులు మందిర, గోపుర, ప్రాకార, మహా ద్వారాలు నిర్మిస్తూ వచ్చారు. వేంకటపతికి నిత్యోత్సవ, వార్షికోత్సవ, పక్షోత్సవ, మాసో త్సవ, సంవత్సరోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నారాయణ వనం అధి పతులు ఆకాశరాజు, తొండమాన్ చక్రవర్తి, పల్లవరాణి సామవై, విజయనగర సామ్రాజ్యాధీశులు సాళువ నరసింహ రాయలు, శ్రీకృష్ణ దేవరాయలు, తిరుమలరాయలు, అచ్యుత రాయలు ఇలా.. ఎందరో మహానుభావులు.. ఇక్కడ అద్భుత నిర్మాణాలను చేపట్టి అపూర్వసేవా కైంక ర్యాల నెలవుగా తిరుమల క్షేత్రాన్ని తీర్చిదిద్దారు.

శ్రీవారిని దర్శించుకునే భక్తులు ముందుగా క్షేత్రపాలకుడైన వరాహస్వామివారిని దర్శించుకోవాలని స్థలపురాణంలో ఉంది. అలాగే స్వామి వారి దర్శనానంతరం... తిరుపతిలో పద్మావతి /బీబీనాంచారి/ అలివేలుమంగ అమ్మవారిని, గోవిందరాజస్వామి వారిని దర్శించుకోవాలి. తిరుమలగిరులలో ఉన్న పవిత్ర ఆకాశ గంగ.. పాపనాశనం.. వకుళమాత ఆలయం,, హాథీరాంజీ మఠం.. త్రిదండి జీయర్‌స్వామివారి మఠం.. వన్యప్రాణుల పార్క్.. వంటి ఆధ్యాత్మిక-పర్యాటక ప్రాశస్త్య మున్న ప్రాంతాల్ని దర్శించుకోవచ్చు. తితిదే బస్సు సర్వీసులతో పాటు ఆయా ప్రదేశాలకు ప్రైవేటు వాహ నాలూ అందుబాటులో ఉంటాయి. తలనీలాలు మొక్కు బడి ఉన్నవారు తప్పనిసరిగా స్వామివారి కల్యాణకట్ట వద్దనే తలనీలాలు సమర్పించాలి

**సంకీర్తన**

**శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శన వేళలు**

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రత్యేక దర్శన వేళలు ఒక్కోరోజు ఒక్కోవిధంగా ఉంటాయి. స్వామివారికి జరిగే నిత్య, వారపు సేవలను బట్టి ఆయా సమయాలను తితిదే నిర్దేశించింది. టిక్కెట్లను ముందస్తుగా అంతర్జాలం, ఈ-దర్శన్, తపాలా శాఖ ద్వారా విక్రయిస్తోంది. ఉదయం నుంచి సాయంత్రంలోపు నిర్దేశించిన సమయంలోపు శ్రీవారిని దర్శించుకునే వేళలను ఎంపిక చేసుకోవచ్చు. ఎంపిక చేసుకున్న సమయం టిక్కెట్టుపై ముద్రిత మవుతుంది. ఈ సమయానికి మాత్రమే ఆలయానికి చేరుకోవడానికి వరుస వద్దకు రావాల్సి ఉంటుంది.

ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లను నిత్యం రూ.300 ధర వంతున 26వేల టిక్కెట్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. 56 రోజులకు ముందుగా టిక్కెట్లను పొందే అవకాశం ఉంది. విశేష పర్వదినాల్లో రద్దీని దృష్టిలో ఉంచుకుని టిక్కెట్ల సంఖ్యను దేవస్థానమే తగ్గిస్తుంది.

# ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి దృష్టికి ఎంపీపీల సమస్యలు

## ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించిన ఎంపీపీల సంఘం ఎస్‌టి విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు శెట్టి నీలవేణి



అనంతగిరి, విజయభాను న్యూస్ : అనంతగిరి రాష్ట్రంలో మండల పరిషత్ అధ్యక్షులు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గౌరవనీయులు సజ్జల రామకృష్ణారెడ్డిని కలసి విన్నవించారు ఎంపీపీల సంఘం ఎస్టీ విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి ఆయన కార్యాలయంలో బుధవారం కలిసిన ఎంపీపీ ల బృందం పలు సమస్యలను వివరించారు.ఎంపీపీల గౌరవ వేతనం 6000 నుంచి 15 వేల వరకు పెంచాలని, రవాణా చార్జీలను 8,000 నుంచి 20వేల రూపాయలకు పెంచాలని కోరారు. అదే విధంగా ఎంపీపీ లకు వ్యక్తిగత సహాయకులను ఏర్పాటు చేయాలని కోరారు. మండల పరిషత్ సాధారణ అభివృద్ధి నిధుల వినియోగంలో ఎంపీపీ లకు చెక్ పవర్ ను సదుపాయం కల్పించాలని విన్నవించారు. ఏజెన్సీ ఆచార సంప్రదాయాల దృశ్యం అధిక సంతానం అనదిగా వస్తున్న తరుణంలో మన్య ప్రాంతంలో స్థానిక ఎన్నికల్లో ఇద్దరు కంటే అధిక సంతానం ఉన్నవారు పోటీకి అర్హులుగా అవకాశం కల్పించాలని కోరారు. అదేవిధంగా కాకినాడ జిల్లా రౌతుల పూడిలో గిరిజన మహిళ అయినటువంటి ఎంపీపీ రాజ్యలక్ష్మి పై దాడికి పాల్పడిన ఘటనను ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. దీనిపై స్పందించిన లిసజ్జల రామకృష్ణారెడ్డిలి గారు తమ దృష్టికి వచ్చిందని సమస్య పరిష్కరించే దిశగా చూస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఎంపీపీల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి వారి దృష్టికి తీసుకొని వెళ్తాను అన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి జీకే వీధి ఎంపీపీలు అనూష దేవి బోయిన కుమారి అనంతగిరి వైఎస్ ఆర్సిపి మండల అధ్యక్షులు శెట్టి ఆనంద్, మండల నాయకులు షేక్ మదీనా,పాడి కృష్ణ మూర్తి,శ్రీను, పాల్గొన్నారు.అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు పాడేరు శాసనసభ్యురాలు శ్రీమతి భాగ్యలక్ష్మి ని, అరకులోయ శాసన సభ్యులు శ్రీ చెట్టి ఫాల్గుణ ని విజయవాడలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది.

## పెంచిన విద్యుత్ ఛార్జీలు ను తగ్గించాలని

# మండల విద్యుత్ కేంద్రం ఎదురుగా నిరసన



అరకులోయ (విజయభాను న్యూస్) : మండల కేంద్రం లోగల విద్యుత్కేంద్రం లో సిపిఎం పార్టీఆధ్వర్యలో నిరసన కార్యక్రమం నిర్వంచారు ఈ సందర్బంగా మండల కార్యదర్శి కిండంగి రామారావు మాట్లాడుతూ సామాన్య ప్రజలపై కస్టమర్ చార్జి, సర్దుబాటు సర్జీ గతంలో వాడిన విద్యుత్ చార్జీలు ఫిక్స్ చర్చిలు రకరకాల పేరుతో సామాన్యులపై మోయలేని భారాలు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడం వలన తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో బడా కార్పొరేట్ శక్తులకు ఆదాయము చేసి పెట్టడానికి ప్రభుత్వము విద్యుత్ కొనుగోలు చేయకుండా ప్రవేట్ శక్తుల చేతిలో పెట్టి రోజు రోజుకి విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలకు మోసం చేస్తుందన్నారు.

మోడీ ప్రభుత్వం ఆదేశాలకు లొంగిపోయి జగన్ ప్రభుత్వం ప్రతినెల కరెంటు చార్జీలు పెంచుతున్నారు బిల్లు లేకుండా కరెంట్ కి ఫిక్స్ చార్జీలని కస్టమర్ చార్జీలు, సర్చార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు చార్జీలు పేర్లతో సామాన్య జనాలను పీల్చిపిచేస్తుంది ప్రపంచంలో కరెంట్ చార్జీలు తగ్గాయి కానీ మన రాష్ట్రంలో సోలార్ విద్యుత్ విద్యుత్ యూనిట్ 12 రూపాయలు ఉండగా ఇప్పుడు ఉత్పత్తి ఖర్చు తగ్గి రెండు రూపాయలకు రేటు పడిపోయింది నిజంగానే కరెంట్ ఛార్జింగ్ తగ్గాలి అయినా తగ్గించకుండా రోజు రోజుకి కరెంట్ చార్జీలు పెంచడం దారుణం. ప్రతిదీ సరుకుగా మార్చి సామాన్యులపై మోయలేని భారం మోపడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రని చేస్తున్నాయి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కుట్రాలను తిప్పి కొట్టాలని ప్రజలందరూ ఐక్యమై విద్యుత్ ఛార్జీలు పెంచిన ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధపడాలని ఈ సందర్భంగా పిలుపునివ్వడం జరిగింది. ఇప్పుడు కొత్త పద్ధతిలో స్మార్ట్ మీటర్లు తీసుకువచ్చి ప్రతి కనెక్షన్ పై సుమారు 13 వేల రూపాయలు వరకు వసూలు చేయడానికి కాంట్రాక్టు ఇస్తున్నారు ఈ మొత్తాన్ని జనమే చెల్లించాలని నిర్ణయం తీసుకున్నారు నెలకు 120 నుండి 150 రూపాయలు వరకు ప్రతి సంవత్సరాల పాటు వసూలు చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతుంది ఈ మీటర్లు వచ్చినట్లయితే మారుమూల గ్రామాలకు ఏజెన్సీ ప్రాంతంలో ప్రతి ఇంటికి చీకటి కమ్మడం తప్పదు ఇటువంటి పరిస్థితుల్లో స్మార్ట్ మీటర్లు తో ప్రభుత్వం పేదల జీవితంతో ఆడుకోవాలని చూస్తుంది కార్పొరేట్ల దోపిడీ ఆపితే ప్రభుత్వ అవినీతి అరికడితే కరెంట్ చార్జీలు పెంచకుండా తగ్గించవచ్చు, విద్యుత్తు నియంత్రణ మండలి ఎత్తివేసిందన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు లొంగిపోయి విద్యుత్ రంగాన్ని మూడు ముక్కలు చేసి సంస్కరణల పేరుతో చార్జీలు పెంచింది గతంలో చంద్రబాబు నాయుడు పెంచిన చార్జీలకు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ ప్రజలతో పెద్ద ఎత్తున పోరాటం నిర్వహించింది తెలుగుదేశం ప్రభుత్వం సామాన్యుడు ప్రాణం తూటాలకు బలి ఇచ్చింది. నాడు కాంగ్రెస్ నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి కూడా ప్రతిపక్ష ఎమ్మెల్యేగా నిరాహార దీక్ష చేశారు కానీ నేడు ఆయన కుమారుడు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు ప్రజలు తిరస్కరించిన విధానాలై అమలు చేయడానికి ముందుకు వస్తున్నారు. ఓట్ల కోసం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక మాయమాటలు చెప్పి గెలిచిన తర్వాత ప్రజల ప్రయోజనాలకు భిన్నంగా పరిపాలన చేస్తున్నారు. పెంచిన విద్యుత్ చదివి తక్షణమే తగ్గించాలని నినాదాలుతో డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు పొద్దు బాలదేవ్ జి. బుజ్జిబాబు కే .మగ్గన్న కే. మొద్దు జి. చిన్న బాబు పి. రామన్న వి. సింహాద్రి.కె.మగ్గన్న తదితరులు పాల్గొన్నారు.

## సబ్బెళ్ళ కలం నుండిజాలువారిన మరో ఆణిముత్యం' గోదావరి యాత్ర' :

# పలువురు ప్రశంసలు



కాకినాడ (విజయభాను న్యూస్) : సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ సబ్బెళ్ళ శివన్నారాయణరెడ్డి కలం నుండి వెలువడిన మరో ఆణిముత్యం గోదావరి యాత్ర పుస్తకం అని పలుమార్లు కొనియాడారు. బుధవారం సాయంత్రం స్థానిక డి కన్వెన్షన్ హాలులో ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి అధ్యక్షతన, శ్రీ వినాయక పబ్లికేషన్స్ పేరుతో సబ్బేళ్ళ రచించిన గోదావరి యాత్ర పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ, సమాచారం, ఆలోచన, ఓర్పు, సహనం, పట్టుదల ఉంటేనే ఇటువంటి పుస్తకాలు బయటకు వస్తాయని, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ దేవాలయాలు, పర్యాటక ప్రదేశాలు, ఆచారాలు, సంప్రదాయాలను సబ్బెళ్ళ తన పుస్తకంలో బంధించిన తీరు అద్భుతం అని ప్రశంసించారు. గతంలో సబ్బెళ్ళ అందించిన పుస్తకాలు ప్రభుత్వం ద్వారా అవార్డులు పొందిన యాత్ర, గోదావరి, అమరావతి, పర్యటక దర్శిని వలే ఈ పుస్తకం కూడ జనాకర్షణ పొంది, అవార్డు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సాయి సుధ హాస్పిటల్ అధినేత డాక్టర్ వాడ్రేవు రవి మాట్లాడుతూ, సంకల్పం బలంగా ఉంటేనే ఆశయం నెరవేరుతుందని, అటువంటి బలమైన సంకల్పంతో ఇటువంటి పుస్తకాలు సృష్టిస్తున్న శివన్నారాయణరెడ్డి కారణజన్ముడు అని కొనియాడారు. పుస్తక రచన ఓ ఎత్తు, దాని బాహ్య ప్రపంచంలో అందుబాటులోకి తీసుకుని రావడం ఓ ఎత్తు అని, అటువంటి సమయంలో అనేక కష్టనష్టాల మధ్య పుస్తక రచన కత్తిమీద సాము వంటిదని అన్నారు. సభాధ్యక్షుడు నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న అనేక పురాతన దేవాలయాలు,పుణ్యక్షేత్రాలు వాటి చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలు, వివిధ కళలు, ప్రసిద్ధ చెందిన వంటకాలు వంటి ఎంతో సమాచారం ఇటువంటి పుస్తకాలలో పొంది పరచినందున వీటిని దేశ విదేశాలలో కూడ తెలుగు వారు ఆదరిస్తున్నారని తెలిపారు. గొప్ప సంకల్పం గొప్ప సంకాలానికి నాంది పలుకుతుంది అని, పుస్తక రచయిత చాలా సున్నితంగా ఈ పుస్తక రచన చేసారని కొనియాడారు.

# జగనన్న సురక్ష కార్యక్రమం పై అవగాహన

## ముఖ్య అతిథిగా జడ్పిటిసి పిఎస్ రాజు హాజరు



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలం వెన్నెల పాలెం లో గల ఏసీ కళ్యాణ మండపంలో వాలంటీర్లకు సచివాలయం సిబ్బందికు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరవాడ జడ్పిటిసి సభ్యులు పీఎస్ రాజు హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష క్యాంప్ నందు ప్రతి గ్రామ సచివాలయంలో 24 -6 -2023 నుండి 30-6-2023వరకు తీసుకున్న రిక్వెస్ట్ లకు సంబంధించి గృహ శారదలో మరియు సచివాలయం కన్వీనర్లు కు ఎంఎల్ఓ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు.. వాలంటీర్ ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు మరియు పత్రాలు సంబంధించిన సమస్యలను తెలుసుకొని పరిష్కరణ కావలసిన పత్రాలను కుటుంబ సభ్యుల నుండి తీసుకొని 1-7-2023 నుండి21-7-2023 తేదీ వరకు జగనన్న సురక్ష క్యాంపు యందు మండల స్థాయి అధికారులతో రెండు టీములుగా ఏర్పాటు చేసుకొని నిర్దేశించిన రోజున సచివాలయంలో వచ్చిన రిక్వెస్ట్ లకు అక్కడికక్కడే యూ పత్రాలు జారీ చేయడం జరుగుతుందన్నారు.. కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం,జనన ధ్రువీకరణ పత్రం, మరణ ధ్రువీకరణ పత్రం, వివాహ ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యుడు ధృవీకరణ పత్రం, మూటిషన్ లావాదేవీలు, ఆధార్ కు ఫోన్ నెంబర్ అను సంధానం, పంట సాగు హక్కు కార్డు, రేషన్ కార్డు విభజన, కుటుంబ సర్వే విభజన మొదలైనవి.. వీటికి సంబం ధించి ఎటువంటి రుసుము వసూలు చేయ బడవని పేర్కొన్నారు.. ఈ కార్య క్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు బందు నాగేశ్వరరావు, వెన్నెల పాలెం సర్పంచ్ వెన్నెల అప్పారావు, జే సి ఎస్ మండల కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, గొర్లవాన పాలెం సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు, రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, నాయుడుపాలెం సర్పంచ్ కుంద్రుపు సీతారామయ్య వరలక్ష్మి, బర్నికం సర్పంచ్ పెద్ది శెట్టి పూజ శేఖర్, గొర్లివాని పాలెం ఎంపీటీసీ గొర్లిఎరుకు నాయుడు, కలపాక ఎంపీటీసీ సప్ప సన్యాసి రావు, ఎంపీడీవో హేమ సుంద్రావు, తాసిల్దార్ పీ కనకారావు, ఈ ఓ ఆర్ డి పద్మజ మండలంలో గల పంచాయతీ కార్య దర్శులు సచివాలయం సిబ్బంది వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు..



# యువత విద్య, క్రీడలు, సాంకేతిక రంగాలలో కృషి చేస్తే దేశానికి కీర్తి



భీమునిపట్నం : విజయభాను న్యూస్ : యువతకు క్రీడా సామాగ్రి పంపిణీ యువత దేశ సంపద దేశ,విదేశాలలో క్రీడల పోటీలలో దేశానికి కీర్తి ప్రతిష్టలు తేవాలని. యువ సమన్వయ అధికారి నెహ్రూ యువ కేంద్ర గురువారంపద్మనాభ మండలం గ్రామం, , లో నెహ్రూ యువ కేంద్ర, గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, ప్రకృతి చికిత్సల యము మహారాణిపేట సంయుక్త నిర్వహణలో క్రీడా సామాగ్రి పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జి మహేశ్వరరావు హాజరై మాట్లాడుతూ దేశ సంపద యువత అని, యువత విద్య, క్రీడలు, సాంకేతిక రంగాల లో కృషిచేసి దేశానికి కీర్తి తేవాలని అన్నారు యువ మహోత్సవాలు, యూత్ ఎక్స్ఛేంజి కార్యక్రమాలు మొదలగు కార్యక్రమాలలో యువత పాల్గొనాలని అన్నారు ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ ద్వారా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అందరూ ఒకటే అని అన్నారు భారత ప్రధాని మోడీ యువతలో దాగి ఉన్న నైపుణ్యమును వెలికితీయుటకు స్కిల్ సెంటర్స్ నూతన క్రీడా ప్రాంగణంలో నిర్మించారని కొని ఆడారు 9 సంవత్సరాల ప్రధాని పాలనలో యువత క్రీడలలో పాల్గొని వందలాది పతకాలు సాధించారని అన్నారు నెహ్రూ యువ కేంద్ర గ్రామస్థాయిలో యువజన కేంద్రాలను నూతనముగా ప్రారంభించి యువతను సామాజిక సేవకులుగా తయారుచేసి గ్రామాభివృద్ధికి అధికారుల సహకారంతో కృషి చేయాలని కోరారు ఈ సందర్భంగా కురపల్లి, రేవిడి, రౌతులపాలెం, తుని వలస, రెడ్డిపల్లి మొదలగు, గ్రామాల యువతకు వాలీ బాల్స్, ఫుట్ బాల్, షటిల్, క్యారం బోర్డ్స్, క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 1985 కామన్వెల్త్ క్రీడలలో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో బంగారు పతకం సాధించిన ఎంవి మాణిక్యా లను, జాతీయస్థాయిలో వంద మీటర్లు, రెండు వందల మీటర్లు, పరుగు పందెము లలోపతకాలను సాధించిన ప్రభుదాసు, దేశ విదేశాలలో వంద మీటర్లు, 50 మీటర్లు హడీల్స్ నందు, లాంగ్ జంప్ , హై జంప్ బంగారు పతకాలను సాధించిన ఎస్ శ్రీలక్ష్మి, మరియు భారతదేశము తరుపున ప్యారిస్ నగరములో జరిగిన క్రీడలలో పాల్గొని బంగారు ,రజిత పతకములు సాధించిన కుమారి యామిని మొదలగు క్రీడాకారులను ఘనముగా సన్మానించారు ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్ రంగస్థల, కళాకారుల సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ఉపాధ్యక్షులు ఉప్పాడ అప్పారావు, స్థానిక వ్యాపారవేత్త రెడ్డిపల్లి శ్రీనివాసరావు, కురపల్లి గ్రామ పెద్దలు పాలూరి కృష్ణారావు, నీలం శెట్టి చిన్నయ్య, శుభం బలరామ ట్రస్ట్ అధినేత పివి ప్రసాద్ పట్నాయక్, పి పవన్, ఎన్ వెంకటేష్, శేఖర్, శంకర్, బంగారు రాజు బర్ల కనక, ఎం గౌరీ రెడ్డి పల్లా భరత్ కుమార్, కంటు భుక్త శ్రీనివాసరావు అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు

# భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్య రథయాత్ర కార్యక్రమంలో మాజీ మంత్రి కోండ్రు



రాజాం (విజయభాను న్యూస్) : మహానాడు వేదికగా జాతీయ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు రూపకల్పన చేసి ప్రకటించిన మేనిఫేస్టోతో రాష్ట్ర ప్రజలకు భరోసా నిస్తూ భవిష్యత్తుకు గ్యారంటీ ఇచ్చారని మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్చార్జి కోండ్రు మురళీమోహన్ గురువారం నాడు పాయకరావుపేట నియోజక వర్గంలో ఏర్పాటుచేసిన భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్య రథయాత్ర కార్యక్రమంలో తెలిపారు. టీడీపీ అమలు చేయబోయే కార్యక్రమాల్ని ప్రతిఒక్కరికీ తెలియచేయడంకోసం బస్సు ప్రచారం ప్రారంభించామని అన్నారు,భవిష్యత్‌కు గ్యారెంటీ పథకాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి బస్సు యాత్ర ప్రచారంలో ఆరు పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు రాష్ట్రవ్యాప్తంగా జోన్లవారీగా 5 బస్సులు నియోజకవర్గాల్లో తిరగనున్నాయన్నారు,ప్రతీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు బస్సుల్లో వెళ్లి ప్రజలతో మమేకమవుతారని కోండ్రు తెలిపారు. ప్రతినియోజకవర్గంలో బస్సులపై పర్యటించి ప్రజల కష్టాలతో పాటు,ప్రజాభిప్రాయాలు తెలుసుకొని,భవిష్యత్‌లో రాష్ట్రం కోసం మరిన్ని మంచి నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జగన్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన,జరుగుతున్న దోపిడీని, దారుణాలను తెలియచేస్తారని తెలిపారు,వీటితోపాటు ప్రజలతో కలిసి పల్లె నిద్రచేసి రాష్ట్ర పునర్నిర్మాణంలో వారిభాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తామని అన్నారు, ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఉత్తరాంధ్ర నియోజకవర్గం నాయకులు ఇంచార్జిలు కార్యకర్తలు అభిమానులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



# గ్రామీణ వైద్యుల గుర్తింపుకు కృషి - జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్

అమలాపురం (విజయభాను న్యూస్) : వారాహి యాత్రలో భాగంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పర్యటన నిమిత్తం అమలాపురం విచ్చేసిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ను రాష్ట్ర అనుభవ వైద్య సంఘాల సమాఖ్య(ఫెడరేషన్) ప్రధాన కార్యదర్శి కంబాల.బాబూరావు కలసి గ్రామీణ వైద్యుల గుర్తింపు మరియు చట్ట బద్ధత కొరకు ఒక వినతి పత్రమును సమర్పించారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తో రాష్ట్ర అనుభవ వైద్య సంఘాల సమాఖ్య(ఫెడరేషన్) ప్రధాన కార్యదర్శి కంబాల.బాబూరావు. మాట్లాడుతూ సుమారు 60 సంవత్సరములు గా గ్రామీణ, పట్టణ, మురికి వాడలలో అనుభవ పూర్వకముగా ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపి,పిఎంపి,బిఎంపి డబ్ల్యుఏ తరహా వైద్యులు గత శతాబ్ది కాలంగా ఏ గుర్తింపు లేకుండా ఉన్న సమయంలో కీ.శే.దివంగత ముఖ్యమంత్రి వైయస్.రాజశేఖర్ రెడ్డి 22-08-2017 వ సంవత్సరంలో గ్రామీణ వైద్యుల గుర్తింపు కొరకు 429 జీవో విడుదల చేసి ఆ జీవో ద్వారా 1,000 గంటలు కమ్యూనిటీ పారామెడిక్స్ ట్రైనింగ్ ను రాష్ట్రంలో ఆయా జిల్లాల ఏరియా ఆసుపత్రిలో ట్రైనింగ్ క్లాసులు ఏర్పాటు చేసారని,అయితే కీ.శే.దివంగత ముఖ్యమంత్రి వైయస్.రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో ఆ తరువాత వచ్చిన ముఖ్య మంత్రులు బడ్జెట్ లేదన్న నెపంతో ఒక జీవోతో ట్రైనింగ్ క్లాసులను అర్ధాంతరంగా నిలిపివేసారని, తరువాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ప్రస్తుతం ప్రతిపక్ష నేత మాజీ ముఖ్యమంతి నారా.చంద్రబాబు నాయుడు 01-04-2008న గ్రామీణ వైదుల చట్టబద్ధత కొరకు 465 జీవో ను ఏర్పాటు చేసారని,కాని అది అమలులోకి రాలేదని,ఆ తరువాత అప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న వైయస్. జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో గ్రామీణ వైద్యుల గుర్తింపు కొరకు 429 జీవో ను పునరుద్ధరణ చేసి ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి తగిన గుర్తింపు అర్హత పత్రాలను ఇప్పించమని కోరగా అందుకు ఆయన స్పందించి అధికారములోకి వచ్చిన వెంటనే గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత తీసుకొని వస్తానని చెప్పారని,అయితే ప్రభుత్వం ఏర్పాటు అయి నాలుగు సంవత్సరములు దాటిగా ఇన్పటి ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్ రెడ్డి గ్రామీణ వైద్యులను పట్టించుకున్న దాఖలాలు లేవని తెలియజేస్తూ వారాహి యాత్రలో భాగంగా మిమ్మల్ని కలిసామని మీరైనా గ్రామీణ వైద్యుల గుర్తింపు కొరకు పోరాడి 2024లో జనసేన పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే 429 జీవో ను పునరుద్ధరణ చేసి గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ త్వరలో విజయవాడ లో జరిగే రాష్ట్ర అనుభవ వైద్య సౌఘాల సమాఖ్య(ఫెడరేషన్) మహాసభకు హాజరు కావాలని కోరారు.ఈ సందర్భంగా రాష్ట్ర అనుభవ వైద్య సంఘాల సమాఖ్య(ఫెడరేషన్) ప్రధాన కార్యదర్శి కంబాల.బాబూరావు. ఇచ్చిన వినతి పత్రాన్ని



క్షుణ్ణంగా పరీక్షించిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సానుకూలముగా స్పందిస్తూ గ్రామాలలో గ్రామీణ వైద్యుల ఆవస్యకత ఎంతైనా ఉంది కాబట్టి ప్రభుత్వం వచ్చిన వెంటనే గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత తీసుకొని వచ్చి ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని,త్వరలో మీ అందరితో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేసి,మీరు తలపెట్ట బోయే గ్రామీణ వైద్యుల మహాసభ కు హాజరై మీ సమస్యలకు పరిష్కారం అందజేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ను కలుసుకునేందుకు అవకాశం కల్పించిన జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాదేండ్ల.మనోహర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు.

# జులై 1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం



కాకినాడ, విజయభాను న్యూస్ : వచ్చే జూలై 1వ తేదీ నుంచి జగనన్న సురక్ష పథకం అనే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది ఈ పథకంనకు సంబంధించి బుధవారం అమరావతిలో సీఎం జగన్ నేతృత్వంలో ఎమ్మెల్యేలతో సమావేశం జరిగిందని దీనికి సంబంధించిన వివరాలను కాకినాడ నగరంలో గురువారం సిటి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం తరహాలో కొత్త కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా ప్రభుత్వ పథకాలు ప్రతీ ఇంటికి అందాలనే ఉద్దేశ్యంతో వలంటీర్లు ఇళ్లకు వెళ్లి వారి రిక్వైర్మెంట్(ధ్రువీకరణ పత్రాలను) యాప్లో నమోదు చేస్తారని తెలిపారు. వారి ఫిర్యాదులను నమోదు చేసి మెగా మేళా నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు పథకాలను వర్తింపచేస్తారన్నారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో అమలు అవుతుందని, జులై1నుండి నెల రోజుల పాటు ఇంటింటి సర్వే జరుపుతారన్నారు. అర్హత లేకపోతే వారికి కారణాలను వివరిస్తామని, ప్రజలు వారికి సమస్యలు తెలియజేయాలని ద్వారంపూడి కోరారు. జనసేన అధినేత పవన్ నారా వారి వారాహి వాహనంలో జిల్లాలో తిరుగుతూ తనపై, కుటుంబ సభ్యులపై నిందారోపణలు చేస్తున్నారని, ఇదంతా చంద్రబాబు, లోకేష్ ఇచ్చిన స్క్రిప్టు అని అన్నారు. లేని ఆరోపణలు చేసి కాకినాడకు చెడ్డ పేరు తీసుకురావద్దని జనసేనానికి సూచించారు. వ్యక్తిగత విమర్శలు కాకినాడకు ఆపాదించవద్దని, పవన్ వాస్తవాలు గ్రహించి మాట్లాడాలన్నారు. తాము బియ్యం మిల్లులు ద్వారా గతం నుండి ఎగుమతులు చేస్తున్నామని, ఇక్కడ నుండి ఇతర రాష్ట్రాల వ్యాపారులు కూడా ఎగుమతులు చేస్తారన్నారు.

ఏపీ నుంచి కేవలం పది శాతం ఉండగా ఇతర రాష్ట్రాల నుండి 90 శాతం బియ్యం ఎగుమతులు ఉంటాయని వాస్తవాలు తెలుసుకుని మాట్లాడం దన్నారు. కాకినాడ పోర్ట్లో ప్రస్తుత కాలంలో 55 లక్షల టన్నుల బియ్యం ఎగుమతి కాగా అందులో కొన్ని కంపెనీలు 13 లక్షల 40 వేల టన్నులు ఎగుమతి చేశాయని అందులో తమ కంపెనీ లక్ష 86 వేల టన్నులు మాత్రమే ఎగుమతి చేసిందన్నారు.

ఇందులో తమకు కేవలం రెండు శాతం లోపు మాత్రమే ఆదాయం సమకూరుతుందని ద్వారంపూడి చెప్పారు. కాకినాడలో అక్రమాలు, అన్యాయాలు తన హయాంలో జరుగుతున్నాయని చెబుతున్న పవన్ ఉత్తమ జీవనాన్ని గడిపే సిటీలో దేశంలో కాకినాడకు నాలుగో స్థానం వచ్చిందనే సంగతిని తెలుసుకోవాలని ద్వారంపూడి చెప్పారు. అనంతరం వైకాపాకు చెందిన నాయకులు మాట్లాడుతూ కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంను విమర్శించే స్థాయి జనసేన నాయకుడు పంతం నానాజీకి లేదన్నారు. కాకినాడ సిటీ, రూరల్ ప్రాంతాల్లో నాయకులుగా చలామణి అవుతున్న వారిని జనసేనాని పవన్ పట్టించుకోలేదన్నారు. ఈ సమావేశంలో కూడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, కాకినాడ సిటీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, నాయకులు ఎన్వి సాయిబాబా, రాజారపు వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడలో ఎమ్మెల్యే ద్వారంపూడి దోపిడి

**- 129.25 కోట్ల భారీ భూ మాయ - నాడు ప్రభుత్వ భూమి, నేడు ప్రైవేట్ భూమి - సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి**





కాకినాడ (విజయభాను న్యూస్) : కాకినాడ నగరంలో 129.25 కోట్ల భారీ భూ మాయకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి తెరలేపాడని, తప్పుడు దృవపత్రాలను సృష్టించి వాటిపై టిడిఆర్ బాండ్లు రూపంలో 129 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకుంటున్నాడని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) విమర్శించారు.కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని సురేష్ నగర్ మున్సిపల్ పార్క్లో ప్రభుత్వ భూమిపై 129.25 కోట్ల టిడిఆర్ బాండ్లు మంజూరుపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి తగు పరిష్కార చర్యలు చేపట్టాలని కోరుతూ వనమాడి గురువారం జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో సుమారు 6 ఎకరాలలో సురేష్ నగర్ మున్సిపల్ పార్క్ సముదాయం వున్నదని గత కొన్ని దశాబ్దాలుగా ఈ పార్క్ సముదాయం చుట్టుపక్కల ప్రాంత ప్రజలందరికి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేందుకు గత ప్రభుత్వాలు వివిధ దశలలో పార్కును అభివృద్ధి చేసాయన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న 1999 సంవత్సరంలో పార్క్ చుట్టూ కాంపౌండ్ వాల్, 2014లో ఇదే పార్క్ స్థలంలో భారత రాజ్యాంగా నిర్మాత డాక్టర్ బిఆర్ అంబెద్కర్ జ్ఞాన మందిర భవనం నిర్మించి ప్రారంభించినట్లు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇదే స్థలంలో కన్వర్టబుల్ స్టేడియం నిర్మాణానికి సుమారు 18 కోట్లు స్మార్ట్ సిటీ నిధులను కేటాయించి 12కోట్లతో పనులు కూడా పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వ పాలనలో బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా గత మూడేళ్లుగా కొనసాగుతున్న పనులను కాంట్రాక్టర్లు నిలిపివేశారని కొండబాబు తెలిపారు. సురేష్ నగర్ పార్క్ విషయంలో ఎటువంటి అభ్యంతరాలు లేవని నిర్ధారించిన తరువాతనే ఆనాడు నగరపాలక సంస్థ వివిధ దశలలో పార్కున్న అభివృద్ధి పరిచారన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సర్వే నెంబర్ 212/%జ%లో 1.93 ఎకరాల భూమి తమకు చెందుతుందని కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ప్రస్తుతం విషయం హైకోర్ట్లో కేసు ఉందన్నారు. 2022 మార్చి 19న కాకినాడ కార్పొరేషన్ సమావేశంలో ఆఘమేఘాలపై ఆ స్థలానిక టిడీఆర్ బాండ్స్ జారీ చేయాలనీ కౌన్సిల్లో ప్రవేశపెట్టి తెలుగుదేశం కార్పొరేటర్లు వ్యతిరేకించినా పాలకమండలి మెజారిటీతో ఎమ్మెల్యే ద్వారంపూడి ఆమోదింపచేశాడని వనమాడి చెప్పారు. గతేడాది ఆగస్టులో పార్కు స్థలంలో టిడిఆర్ బాండులు మంజూరుపై తెలుగుదేశం ఆందోళన నిర్వహించి జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని గజానికి 18 వేల ప్రకారం, 35,904 చదరపు గజాల భూమి మొత్తం విలువ 64.62 కోట్లు కాగా, రెసిడెన్షియల్ భూమిని వాణిజ్యంగా మార్పు చేసి చదరపు గజం విలువ 36 వేలు చేసి 129.25 కోట్లు టిడిఆర్ బాండ్ల రూపంలో ఎమ్మెల్యే ద్వారంపూడి దోచుకుంటున్నాడని వనమాడి చెప్పారు.

ఈ టిడిఎస్ బాండ్లను మార్పు చేసేందుకు ఓ ఎంపీ సహకరించారన్నారు. ఈ భూ మాయకు సంబంధించి గురువారం కలెక్టర్ను కలిసి టిడిఆర్ బాండ్ల మంజూరుపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి తగిన పరిష్కార చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించి కాకినాడ నగర ప్రజల ఆస్తులను రక్షిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, పలివెల రవికుమార్, గదుల సాయిబాబా, తుమ్మల రమేష్, శీకోటి అప్పలకొండ, ఒమ్మి బాలాజీ, ఎండి ఆన్సర్, ఎస్కె రహీమ్, బంగారు సత్యనారాయణ, అంబటి చిన్నా, గాది శివ, వానపల్లి పోలీస్, పంతాడి రాజు తదితరులు పాల్గొన్నారు.

# విరిగిన రైలు పట్టా.. సంఘమిత్ర ఎక్స్ప్రెస్కు తప్పిన ప్రమాదం

చీరాల, విజయభాను న్యూస్ : బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టా విరిగిపోయింది. కీ మ్యాన్ గుర్తించడంతో పెను ప్రమాదం తప్పింది. గురువారం ఉదయం బెంగళూరు వెళ్తున్న సంఘమిత్ర ఎక్స్ప్రెస్.. ఈపూరుపాలెం సమీపానికి వచ్చేసరికి అక్కడ పట్టా విరగడాన్ని కీమ్యాన్ గుర్తించారు. వెంటనే సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేశారు. దీంతో అధికారులు రైలును నిలిపేశారు. అనంతరం సిబ్బంది మరమ్మతులు చేపట్టి యథావిధిగా రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో సుమారు అరగంట సేపు పలు రైళ్లు ఆలస్యమయ్యాయి. వివిధ స్టేషన్లలో ఐదు రైళ్లను నిలిపేశారు.

# మత్స్యకారులకు చేపల వేటలో రింగు వలల నిషేధంపై అత్యవసర సమావేశం



భీమునిపట్నం (విజయభాను న్యూస్) : రాష్ట్ర మత్స్యశాఖ మరియు పోలీసు శాఖ వారు సంయుక్తంగా గురువారం భీమిలి మండలం లోని మత్స్యకారులకు చేపల వేటలో రింగు వలల నిషేధం గురించి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్య శాఖ సంయుక్త సంచాలకులు జి విజయ మాట్లాడుతూ విశాఖ తీరంలో రింగు వలల వాడుకపై కోర్టు వారు నిషేధం విధించారని, కనుక మత్స్యకారులంతా కోర్టు వారి ఆదేశాలను అతిక్రమించకూడదని చెప్పారు. అలానే చిన్న కన్ను వలలు మరియు రింగు వలలు వాడితే భవిష్యత్తు తరాలకు సముద్రంలోని మత్స సంపద తగ్గిపోతుందని తెలియజేశారు. డిఎస్పి కాళిదాసు మాట్లాడుతూ మత్స్యకారులంతా ప్రభుత్వానికి సహకరించి చేపల వేటలో రింగువలలు వాడకూడదని ఎవరైనా కోర్టు వారి ఆదేశాలను అతిక్రమించి రింగువలలను ఉపయోగిస్తే వారిపై తాము చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న మత్స్యకార నాయకులు మరియు తోటి మత్స్యకారులు సానుకూలంగా స్పందిస్తూ తదుపరి ఆదేశాలు వచ్చేవరకు తాము చేపల వేటలో రింగువలలను వాడబోమని కోర్టువారి ఆదేశాలను గౌరవించి పాటిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఎం. విజయకృష్ణ, భీమిలి మత్స్యశాఖ అభివృద్ధి అధికారిని డి. లావణ్య, సిఐ లక్ష్మణమూర్తి, సిఐ చంద్రశేఖర్, ఎస్ఐ మురళీకృష్ణ, ఎస్ఐ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మకోట గ్రామ పంచాయతీ సచివాలయం లో సర్పంచ్ పాగి అప్పారావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం



అనంతగిరి, విజయభాను న్యూస్ : సర్పంచ్ పాగి అప్పారావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరిగింది.... ఈ కార్యక్రమం లో సర్పంచ్ అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు మేరకు వాలంటీర్లు మరియు సచివాలయం సిబ్బంది గడప గడప కి వెళ్లి ప్రభుత్వం ఇప్పటివరకు అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలు ఇంకా ఎవరికి అయినా అర్హత ఉండి ఏదైనా కారణాలు వల్ల రాని వారు ఉంటే వాళ్ళ యొక్క పూర్తి సమాచారం సేకరించి వాల్లకు లబ్ధి చేకూర్చే ధంగా చేయాలని.తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కోటి బాబు, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పంచాయతీ మెంబర్లు పెరుమాల్ల మహేష్ యధిథరులు పాల్గొన్నారు, ..ఇదే కార్యక్రమం లో సర్పంచ్ పాగిలి అప్పారావు చేతులు మీదుగా రైతులు కు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తున్న వరి విత్తనాలు ఉద్యానవన శాఖ అసిస్టెంట్ ద్వారా పంపిణి చెయ్యడం జరిగింది.



# జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : మజ్జి శ్రీనివాసరావు




విజయనగరం, విజయభాను న్యూస్ : జగనన్న సురక్ష కార్యక్రమం అమలును జిల్లా అధి కారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయ వంతం చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా సిఎం జగన్ ఈనెల 23 నుంచి జగనన్న సురక్ష క్యాంప్ అనే నూతన కార్యక్రమం ద్వారా గ్రామాల్లోకి ప్రభుత్వం మరియు పార్టీ యంత్రాంగాన్ని ప్రజల వద్దకు పంపించి 9అంశాలతో కూడిన ప్రభుత్వ పత్రాలను ఉచితంగా అందించేందుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, జనన ధ్రువీకరణ, మరణ ధ్రువీకరణ, కుటుంబ దృవీకరణ, వివాహ ధ్రువీకరణ, లావాదేవి మ్యుటేషన్లు, ఫోన్ నెంబర్కు ఆధార్ అనుసంధానం, పంట సాగు హక్కు కార్డు వంటి ముఖ్యమైన పత్రాలను నేరుగా ప్రజల ఇంటి వద్ద నూతనంగా రూపొందించిన యాప్లో ప్రతిస్పందనలు నమోదు చేసుకొని వారి పత్రాలను సేకరించి టోకెన్ నెంబర్ ద్వారా వారి సమస్యను పరిష్కారం చేసేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. జగనన్న సురక్ష క్యాంప్ కార్యక్రమంలో జిల్లా అధికార యంత్రాంగం మరియు పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం

## తమన్నా ఐకాన్..
## తను మాత్రమే అలా చేయగలదు: విజయ్ వర్మ



రియల్ లైఫ్ ప్రేమ జంట తమన్నా-విజయ్ వర్మ నటించిన వెబ్ సిరీస్ 'లస్ట్ స్టోరీస్2' తాజాగా విడుదలైన దీని ట్రైలర్ ప్రేక్షకులను ఆకర్షిస్తోంది. ఈనెల 29 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఇది ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలో ప్రచారాన్ని షురూ చేసింది నిర్మాణ సంస్థ. తాజాగా విజయ్ వర్మ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తమన్నాతో కలిసి పనిచేయడంపై ఆసక్తికర కామెంట్స్ చేశాడు. ఆ పాత్రకు తమన్నా మాత్రమే సరిపోతుందని.. ఆమెపై పొగడ్తల వర్షం కురిపించాడు. ప్రస్తుతం ఆ కామెంట్స్ నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి."తొలుత స్క్రిప్ట్ చదవగానే హీరోయిన్ పాత్రలో ఎవరు నటిస్తున్నారని అడిగాను. తమన్నా అని చెప్పగానే సరైన ఎంపికగా అనిపించింది. నిజానికి ఆ పాత్రకు ఆమె కరెక్ట్‌గా సరిపోయింది. దానికి మరింత గ్లామర్‌ను తెచ్చింది. తను నటించే పాత్రలో ప్రతి విషయాన్ని లోతుగా పరిశీలిస్తుంది. చాలా శ్రద్ధగా పని చేస్తుంది. ఆమె మాత్రమే అలా చేయగలదు. మన తోటి నటీనటులు ఉత్సాహంగా ఉన్నప్పుడు షూటింగ్ సరదాగా ఉంటుంది. ఆమె ఐకాన్. నేను తమన్నా నటించిన 'బాహుబలి'ని థియేటర్లో చూశా.. తాజాగా ఆమె నటించిన 'బబ్లీ బౌన్సర్'ను చూశాను వాటిల్లో ఆమె నటన చూసి ఆశ్చర్యపోయాను. లస్ట్ స్టోరీస్-2 చూశాక మీరంతా కూడా ఆమె నటనను ప్రశంసిస్తారు" అని చెప్పాడు.

ఇక ఈ వెబ్‌సిరీస్ షూటింగ్‌లోనే వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించినట్లు ఇటీవల తమన్నా వెల్లడించింది. సమయం వచ్చినప్పుడు వీళ్ల ప్రేమకు సంబంధించిన విషయాలు చెబుతానని విజయ్ వర్మ చెప్పాడు. మరోవైపు తమన్నా వరుస సినిమాలతో బిజీగా ఉంది. ప్రస్తుతం చిరంజీవితో కలిసి 'భోళా శంకర్'లో నటిస్తోంది. అలాగే రజనీకాంత్ 'జైలర్'లో కనిపించనుంది. ఇటీవలే దీని షూటింగ్ పూర్తయినట్లు చిత్రబృందం తెలిపింది.

## చంద్రముఖి-2 ముగించేశారు



రజినీకాంత్ హీరోగా నటించిన చంద్రముఖి చిత్రానికి సీక్వెల్ ప్రకటించి చాలా రోజులైంది. తాజా సమాచారం ప్రకారం ఆ చిత్ర షూటింగ్ పూర్తిచేసినట్లు తెలుస్తోంది. వాసు దర్శకత్వంలో రాఘవ లారెన్స్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ చిత్ర యూనిట్ అంతా కలిసి సోషల్ మీడియాలో తాజాగా ఓ ఫోటో షేర్ చేశారు. వడివేలు, కంగనా రనౌత్ ఇతర కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి ఎం ఎం కీరవాణి సంగీతం అందించగా లైకా ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్ తో నిర్మాణం వహించింది.

## ఐర్లాండ్‌కు మరో షాక్
## చివరి బంతికి స్కాట్లాండ్ చేతిలో ఓటమి



హరారే: ఐసిసి వన్డే ప్రపంచకప్ క్వాలిఫయర్స్ మ్యాచుల్లో ఐర్లాండ్ జట్టుకు మరో చేదు అనుభవం ఎదురైంది. బుధవారం జరిగిన గ్రూప్-బి లీగ్ పోటీలో స్కాట్లాండ్ జట్టు చివరి బంతికి ఫోర్ కొట్టి ఐర్లాండ్‌పై సంచలన విజయం నమోదు చేసు కుంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ జట్టు 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 286 పరుగులు చేసింది. క్యాంపర్(120) సెంచరీకి తోడు డాక్రెల్(69) అర్ధసెంచరీతో మెరిసాడు. స్కాట్లాండ్ బౌలర్ మెక్ ముల్లెన్‌కు ఐదు వికెట్లు దక్కాయి. ఛేదనలో స్కాట్లాండన్టు నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 289పరుగులు చేసి గెలిచింది. చివరి ఓవర్లో విజయానికి 8పరుగులు చేయాల్సిన స్కాట్లాండన్టు తొలి రెండు బంతుల్లో 5పరుగులు రాబట్టింది. ఆ తర్వాత షరీఫ్ వికెట్‌ను కోల్పోయి. ఆ తర్వాతి 2బంతులకు ఒక్క పరుగే చేయగల్గింది. ఆ దశలో చివరి బంతికి లీస్క్(91) ఫోర్ కొట్టి స్కాట్లాండ్‌ను గెలిపించాడు. ఐర్లాండ్ బౌలర్లు అడైర్‌కు మూడు, లిట్టిల్, డాక్రెల్‌కు రెండేసి వికెట్లు దక్కాయి.

**ఓమన్ ఖాతాలో రెండో గెలుపు**

గ్రూప్-బిలో ఓమన్ జట్టు వరుసగా రెండో విజయాన్ని సొంతం చేసుకుంది. రెండో లీగ్ మ్యాచ్‌లో ఓమన్ జట్టు 5వికెట్ల తేడాతో యుఏఇని చిత్తుచేసింది.

తొలిగా బ్యాటింగ్‌కు దిగిన యుఏఇ నిర్ణీత 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 227పరుగులు చేయగా.. ఛేదనలో ఓమన్ జట్టు 46ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 228పరుగులు చేసి గెలిచింది. దీంతో గ్రూప్-బిలో ఓమన్ జట్టు 4పాయింట్లతో అగ్ర స్థానంలో ఉండగా.. 23న జరిగే శ్రీలంకను చిత్తుచేస్తే.. ప్రధాన టోర్నీకి చేరువ కానుంది.



### డేవిస్‌కప్‌కు బొప్పన్న గుడ్‌బై

భారత టెన్నిస్ డబుల్స్ స్పెషలిస్ట్ ఆటగాడు రోహన్ బొప్పన్న టెన్నిస్ కెరీర్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు బుధవారం తెలిపాడు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో మొరాకోతో జరిగే డేవిస్ కప్ తర్వాత టెన్నిస్ కెరీర్‌కు గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నట్లు, అదే తన ఆఖరి ఫేర్‌వెల్ మ్యాచ్ అని వెల్లడించాడు.

'ది కానిస్టేబుల్' షూటింగ్‌లో గాయపడ్డ
## వరుణ్ సందేశ్



యువ కథానాయకుడు వరుణ్ సందేశ్ 'ది కానిస్టేబుల్' సినిమా షూటింగ్‌లో గాయపడ్డాడు. యాక్షన్ సీన్స్ చిత్రికరిస్తున్న సమయంలో వరుణ్ సందేశ్ కాలుకు బలమైన గాయమైనట్లు . చిత్రబందం తెలిపింది. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించామని.. పరీక్షించిన వైద్యులు 3 వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారని వెల్లడించింది. దీంతో 'ది కానిస్టేబుల్' చిత్ర షూటింగ్ నిలిచిపోయింది. నిర్మాత బలగం జగదీశ్ మాట్లాడుతూ.. ఇప్పటికే 40 శాతం చిత్రీకరణ పూర్తైందని.. వరుణ్ కోలుకున్న తర్వాత రెండో షెడ్యూల్‌ను ప్రారంభిస్తామని తెలిపారు.

## ఇక్కడ తప్పుకోవడం అక్కడ ఒప్పుకోవడానికేనా?



తెలుగులో చాలా రోజులపాటు అగ్ర స్థానంలోనే కనిపించింది పూజాహెగ్డే. స్టార్ హీరోల సినిమాల్లో వరుసగా అవకాశాలు అందుకుంది. అయితే.. ఈమధ్యే ఆమె కెరీర్ లయ తప్పినట్లైంది. కొన్ని పరాజయాలు... ఒప్పుకున్న కొన్ని ప్రాజెక్టులు ఆలస్యం కావడం.. తదితర కారణాలతో పూజాహెగ్డే సందడి కరువైంది. బాలీవుడ్‌లో మాత్రం తరచూ అవకాశాలు అందుకొంటూనే ఉంది. తెలుగులో ఆమె అధికారికంగా ఒప్పుకున్న సినిమా 'గుంటూరు కారం' మాత్రమే. అయితే ఇప్పుడు ఆ సినిమా నుంచి కూడా తప్పుకున్నట్టు తెలుస్తోంది. దాంతో ఆమె చేతిలో ప్రస్తుతానికి తెలుగు సినిమాలేవీ లేనట్టే. ఈ పరిణామాలతో మరికొంతకాలం హిందీ కెరీర్‌పైనే దృష్టి పెట్టే ఆలోచనలో పూజ ఉన్నట్టు సమాచారం. కొత్తగా కొన్ని హిందీ సినిమాల విషయంలోనూ ఆమె పేరు వినిపిస్తోంది.

## కరణ్ జోహార్‌కు అరుదైన గౌరవం



బాలీవుడ్ దర్శక-నిర్మాత కరణ్ జోహార్ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా ప్రపంచ సినిమాకు కరణ్ అందిస్తోన్న సేవలను గుర్తించిన యూకే ప్రభుత్వం ఆయన్ని సన్మానించింది. ఈ మేరకు చట్టసభ సభ్యుల సమక్షంలో బ్రిటిష్ పార్లమెంట్ ఆయన్ని సత్కరించింది. దీనికి సంబంధించిన ఫొటోలను కరణ్ ట్విటర్ వేదికగా షేర్ చేశారు. "ఈరోజు నాకెంతో ప్రత్యేకం. లండన్‌లోని యూకే పార్లమెంట్ వేదికగా గౌరవనీయులైన భరోనెస్ వర్మ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. నాపై ప్రేమాభిమానాలు కురిపిస్తోన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. నా నుంచి మరెన్నో మంచి సినిమాలు రానున్నాయని మాటిస్తున్నా' అని తెలిపారు.

'కుచ్ కుచ్ హౌతా హై', 'కభీ ఖుషీ కభీ గమ్', 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్', 'బాంబే టాకీస్' వంటి కుటుంబ, యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్స్‌ను కరణ్ తెరకెక్కిం చారు. ఏడేళ్ల తర్వాత ఆయన తెరకెక్కించిన సరికొత్త చిత్రం 'రాఖీ ఔర్ రాణి కీ ప్రేమ్ కహానీ'. రణ్‌వీర్ సింగ్, అలియాభట్ నటించిన సినిమా త్వరలో యూకేతోపాటు ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.

## ప్రభాస్, మహేశ్‌బాబు నాకంటే పెద్ద హీరోలు..
## ఇగో లేదు: పవన్ కల్యాణ్



ప్రభాస్ , మహేశ్‌బాబు తనకంటే పెద్ద హీరోలని, ఎక్కువ పారితోషికం తీసుకుంటారని ప్రముఖ కథానాయకుడు, జనసేనఅధినేత పవన్ కల్యాణ్ అన్నారు. వారాహి విజయయాత్రలో భాగంగా కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తనకు హీరోలందరిపైనా అభిమానం ఉందని తెలిపారు.

"మీ అభిమానులు, ఎన్టీఆర్ అభిమానులు గొడవపడుతుంటారు' అని కొందరు నాతో అంటుంటారు. సినిమా అనేది వినోదం, ఆనందం. నాకు జూనియర్ ఎన్టీఆర్, మహేశ్‌బాబు,రామ్ చరణ్, అల్లు అర్జున్, చిరంజీవి, బాలకృష్ణ.. ఇలా ప్రతి ఒక్కరిపై నాకు గౌరవం ఉంది. వారి సినిమాలను నేను చూస్తా. కనిపిస్తే మాట్లాడుకుంటాం. సినిమాల పరంగా మీ హీరోల మీద ఇష్టాన్ని రాజకీయాల్లో చూపించకండి. ఇక్కడ రైతుకు కులం లేదు. ప్రభాస్, మహేశ్‌బాబు నాకంటే పెద్ద హీరోలు. పాన్ ఇండియా హీరోలైన వారు నాకంటే ఎక్కువ పారితోషికం తీసుకుంటారు. చరణ్, ఎన్టీఆర్ అయితే గ్లోబల్ స్థాయికి వెళ్లారు. వారు తెలిసినంతగా ప్రపంచవ్యాప్తంగా నేను తెలియదు. ఆ విషయంలో నాకు ఎలాంటి ఇగో లేదు. సగటు మనిషి బాగుంటే చాలనుకుంటా. కులంపరంగా మనలో మనం గొడవ పడొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. సినిమాల విషయంలో ఎవరినైనా అభిమానించండిగానీ రాజకీయం విషయంలో సమష్టిగా ఆలోచిద్దాం. పోరాటం చేసేవాళ్లు ఈ సమాజానికి కావాలి. నేను ఒక్కడినే సరిపోను. అన్యాయం జరుగుతున్నప్పుడు ప్రశ్నించే నాయకులు కావాలి. ఆడ పడుచులు, యువత కావాలి. మీరు ఆ విధంగా తయారవ్వాలని కోరుకుంటున్నా" అని అన్నారు.

## ముందుందిగా సినిమా పండగ
## వేసవిని మించేలా వర్షాకాలం వినోదం



ఏడాది సినీ వేసవి పూర్తయినట్టే. 'ఆదిపురుష్' తప్ప ఆ స్థాయిలో బాక్సాఫీస్ దగ్గర సందడి చేసిన సినిమాలేవీ ఈసారి రాలేదు. కీలకమైన ఈ సీజన్‌లో అగ్ర తారల చిత్రాలు ఎక్కువగా విడుదల కాలేదు. దాంతో సినీ అభిమానులు అరకొర వినోదంతోనే సరిపెట్టుకోవల్సి వచ్చింది. ముందున్న సినిమా వరస మాత్రం ఊరిస్తోంది. రానున్న నాలుగు నెలల కాలంలో టాలీవుడ్‌లో మరో కొత్త సీజన్ ఆవిష్కృతం కానుంది. అగ్ర తారల చిత్రాలు పోటాపోటీగా విడుదల కోసం ముస్తాబవుతున్నాయి.తెలుగు సినిమా విడుదల అనగానే దేశవ్యాప్తంగా ప్రేక్షకులు ఆసక్తి కనబరుస్తుంటారు. కొన్నాళ్లుగా తెలుగు చిత్రాలు పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతూ విడుదల అవుతుండడమే అందుకు కారణం. ఈ వేసవిలోనూ అలా పలు భాషల్ని లక్ష్యంగా చేసుకున్న చిత్రాలు చాలానే ప్రేక్షకుల ముందుకొచ్చాయి. 'దసరా', 'శాకుంతలం', 'విరూపాక్ష', 'ఏజెంట్', 'కస్టడీ', 'ఆదిపురుష్' ఆ జాబితాలోవే. సహజంగా వేసవి అనగానే అగ్ర తారల సినిమాలు పోటాపోటీగా విడుదలవుతూ ఉంటాయి. ఈసారేమో మన అగ్ర తారలంతా సెట్స్‌కే పరిమితం అయ్యారు. మొదట వేసవినే లక్ష్యంగా చేసుకున్నా... సరైన ప్రణాళిక లేకపోవడంతో చాలా సినిమాలు వెనక్కి తగ్గాయి. దాంతో గ్రౌండ్ ఖాళీగా కనిపించింది. ఇదే అదనుగా పరిమిత వ్యయంతో రూపొం దిన పలు చిత్రాలు అదృష్టాన్ని పరీక్షించుకున్నాయి. కానీ వాటిలోనూ కొత్తదనం లేకపోవడంతో పెద్దగా ప్రభావం చూపించలేకపోయాయి. వచ్చిన వాటిలో 'దసరా', 'విరూపాక్ష', 'ఆదిపురుష్'.. ఇలా కొన్ని సినిమాలు మాత్రమే వసూళ్లతో బాక్సాఫీసు దగ్గర సందడి చేశాయి. వేసవికి రాలేకపోయిన అగ్ర తారల సినిమాలు వర్షాకాలంలో సందడికి సిద్ధమవుతున్నాయి. వేసవి సెలవులు పూర్తవ్వగానే బాక్సాఫీస్ దగ్గర సందడి తగ్గుముఖం పడుతుంది. విద్యార్థులంతా స్కూళ్లు, కాలేజీలకి పయనం అవడంతో థియేటర్లకి ప్రేక్షకుల తాకిడి తగ్గిపోతుంది. దసరా వరకు అగ్ర తారల సినిమాలు అంతంత మాత్రంగానే విడుదలవుతాయి. ఈసారి మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపించనున్నాయి. జులై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో అగ్ర తారల సినిమాలు వరుస కట్టనున్నాయి. జులై 28న పవన్‌కల్యాణ్, సాయిధరమ్ తేజ్‌ల 'బ్రో' రానుంది. ఆగస్టు 10న రజనీకాంత్ 'జైలర్', 11న చిరంజీవి 'భోళాశంకర్' విడుదల కానున్నాయి. సెప్టెంబరు 1న విజయ్ దేవరకొండ 'ఖుషి', ఇదే నెల 28న ప్రభాస్ 'సలార్' విడుదలవుతున్నాయి.



# రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి సీఎస్‌కే ముందుకు వచ్చింది : సీఎం జగన్



అమరావతి, (విజయభాను న్యూస్) : "ఆడుదాం ఆంధ్ర" పేరుతో నిర్వహించనున్న క్రీడా సంబరాలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు.. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ పోటీల నిర్వహణపై వివరాలను సీఎం జగన్‌కు అందించారు. ఈ క్రమంలో ఈ ఆటలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికి తీయడానికి ఈ క్రీడా సంబరాలు ఉపయోగపడాలని పేర్కొన్నారు.

ప్రముఖ క్రీడాకారులను భాగం చేయండి..

"చక్కటి స్ఫూర్తిని నింపేలా ఆటల పోటీలు సాగాలి. పోటీలకు వచ్చే క్రీడాకారులకు మంచి భోజనం సహా ఇతర సదుపాయాలు అందేలా చూడాలి. పోటీలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలి. రాష్ట్రానికి చెందిన ప్రముఖ క్రీడాకారులు అంతా ఈ పోటీల్లో భాగస్వామ్యం అయ్యేలా చూడాలి. రాష్ట్రంలో క్రికెట్ సహా ఇతర క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

విశాఖపట్నంలో మరో అత్యాధునిక క్రికెట్ స్టేడియం దిశగా అడుగులు వేయాలి. ఇది సాకారం అయ్యాక ప్రస్తుతం విశాఖపట్నంలో ఉన్న వైయస్సార్ స్టేడియంను.. క్రీడలకు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా తీర్చిదిద్దేదిశగా ముందడుగులు వేయాలి. ఈ ఆలోచనను ముందుకు తీసుకెళ్లాలి" అని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు.

సీఎస్‌కే ముందుకు వచ్చింది

ఇక రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి చెన్నై సూపర్ కింగ్స్ ముందుకు వచ్చిందన్న ముఖ్యమంత్రి జగన్.. కడప, తిరుపతి, మంగళగిరి, విశాఖపట్నంలలో క్రికెట్ అకాడమీల ఏర్పాటు దిశగా ముందుకు సాగాలంటూ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కాగా ఈ సమీక్షా సమావేశంలో సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్‌రెడ్డి, క్రీడలు, యువజన సర్వీసులశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జి వాణీమోహన్, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎన్ గుల్జార్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి, శాప్ వీసీ అండ్ ఎండీ కె.హర్షవర్ధన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి భారత్ చేరువ..



వాషింగ్టన్: భారత అంతరిక్ష రంగం లో కీలక పరిణామం. ఇప్పటివరకు భారతీయ వ్యోమగామి అడుగుపెట్టని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం మనకు చేరువకానుంది. 2024లో ఐఎస్ఎస్‌కు ఉమ్మడి మిషన్ ను భారత్- అమెరికాలు ప్రకటించనున్నట్లు వైట్‌హౌస్ వెల్లడించింది. నాసా ఇస్రో ల నడుమ ఈ మేరకు అంగీకారం కుదిరినట్లు పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికాలో పర్యటిస్తున్న వేళ.. దీనిపై ఒక ప్రకటన రానున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు అంతరిక్ష అన్వేషణకు, ముఖ్యంగా జాబిల్లిపై ప్రయోగాలకు సంబంధించి అమెరికా రూపొందించిన 'ఆర్టెమిస్ ఒప్పందం లో భాగం కావాలని భారత్ నిర్ణయించినట్లు వైట్‌హౌస్ తెలిపింది.

# ఆహారంతో ఆరోగ్యం

## యోగా విలేజ్‌లో ఫలహార కేంద్రం ప్రారంభం




ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్) :** ఆహారంతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. గురువారం ఉదయం బీచ్‌రోడ్డులోని యోగా విలేజ్‌లో ఏర్పాటు చేసిన ఫలహార కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సిరిధాన్యాలతో ఆహార పదార్ధాలను తయారు చేస్తున్న విధానం ప్రత్యక్షంగా పరిశీలించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ మానవ ఆరోగ్యానికి ఉపయుక్తంగా నిలచే సిరిధాన్యాలను ఉపయోగిస్తూ విభిన్న ఆహార పదార్ధాల తయారీ చేస్తూ, విక్రయించే విధంగా ఈ కేంద్రం ఏర్పాటు చేసామన్నారు. ప్రజల్లో ఆరోగ్యం పట్ల, ఆహారం పట్ల అవగాహన పెంపొందించడానికి ఈ కేంద్రం ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు భానుకుమార్, డాక్టర్ తులసి రావు,రాజీ వీసీ ఆచార్య వి.బాల మోహన్ దాస్, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, అవినాష్ నిర్వాహకులు ప్రజ్ఞానంద్, సాయిపద్మ తదితరులు పాల్గొన్నారు.

# జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు ఏపీ ప్రభుత్వం సత్కారం




విజయవాడ, **(విజయభాను న్యూస్) :** సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాను ఏపీ ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. ఆయన గౌరవార్థం ప్రభుత్వం ఆత్మీయ విందు ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఏపీ హైకోర్టు సీజేగా పనిచేసిన జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఇటీవలే సుప్రీం జడ్జిగా పదోన్నతి పొందారు. జస్టిస్ మిశ్రా.. ఆగస్టు 29, 1964న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయగఢ్‌లో జన్మించారు. బిలాస్‌పూర్‌లోని గురు ఘసిదాస్ యూనివర్సిటీ నుంచి బీఎస్సీ, ఎల్ఎల్‌బీ పట్టాలు పొందారు. 1987 సెప్టెంబరు 4న న్యాయవాదిగా పేరు నమోదు చేయించుకుని రాయ్‌గఢ్‌లోని జిల్లా కోర్టు, జబల్‌పూర్‌లోని మధ్యప్రదేశ్ హైకోర్టు, బిలాస్‌పూర్‌లోని ఛత్తీస్‌గఢ్ హైకోర్టుల్లో ప్రాక్టీసు చేశారు. సివిల్, క్రిమినల్ కేసుల్లో పేరుగాంచారు. ఛత్తీస్‌గఢ్ బార్ కౌన్సిల్‌కు చైర్మన్‌గా పనిచేశారు. 2004 జూన్ 26 నుంచి 2007 ఆగస్టు 31 వరకు ఆ రాష్ట్ర అదనపు అడ్వొకేట్ జనరల్‌గా పనిచేశారు. అనంతరం సెప్టెంబర్ 1, 2007 నుంచి న్యాయమూర్తి అయ్యే వరకూ అడ్వొకేట్ జనరల్‌గా కొనసాగారు. డిసెంబరు 10, 2009న ఛత్తీస్‌గఢ్ న్యాయమూర్తిగా నియమితులయ్యారు. కాగా, 2021, జూన్ 1 వ తేదీ నుంచి ఛత్తీస్‌గఢ్ హైకోర్టుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించారు. తర్వాత ఏపీ హైకోర్టు సీజేగా పని చేసి ఇటీవలే సుప్రీం కోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు.

# సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించండి

## - జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ



విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ గురువారం పత్రికా ప్రకటన ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వాతావరణ మార్పు వలన సాధారణంగా సీజనల్ వ్యాధుల వ్యాప్తి తో పాటు దోమలు వృద్ధి చెందుతాయని, వాటి నివారణకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా దోమలు వృద్ధి చెందకుండా నీటి నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని, పూల కుండీలు, నీటి తొట్టిలోని నీరు, కొబ్బరి బోండాలు, ఖాళీ సీసాలు, ఫ్రిజ్ వెనక భాగాన నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమ తెరలు ఉపయోగించాలని, పరిసరాలు పొడిగా ఉండే విధంగా చూడాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ప్రజలకు సూచించారు.

ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండి జ్వరం వచ్చిన వెంటనే అశ్రద్ధ చేయకుండా డాక్టర్ను సంప్రదించాలని తెలిపారు. అలాగే నగరంలోని మలేరియా సిబ్బంది, ఏ.ఎన్.ఎం.లు, వార్డు సచివాలయ హెల్త్ కార్యదర్శులు, వాలంటీర్ల సహకారంతో సీజనల్ వ్యాధులపై సర్వే చేపట్టి ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఆదేశించామన్నారు. కాలువలోని మురుగు నీరు నిలవ లేకుండా పారిశుద్ధ సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించామన్నారు. దోమల నివారణకు కాలువలలో దోమల నివారణ మందు పిచికారి చేయడంతో పాటు ఫాగింగ్ చేయాలని, ఈ ఏడాది డెంగ్యూ కేసుల నమోదు శాతం ఉండరాదని తెలిపారు.

# ద్రవ్యోల్బణం కట్టడిలో పని సగమే పూర్తయ్యింది

## : ఆర్‌బిఐ గవర్నర్



ముంబయి: ద్రవ్యోల్బణం కట్టడిలో భాగంగా కీలక వడ్డీ రేట్లను పెంచుతూ వచ్చిన ఆర్‌బిఐ గత రెండు దఫాలుగా రేట్ల పెంపునకు విరామం ప్రకటించింది. ద్రవ్యోల్బణం లక్షిత స్థాయిలోకి రావడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ద్రవ్యోల్బణం కట్టడిలో నిర్దేశించుకున్న లక్ష్యంలో సగం పనే పూర్తయ్యిందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ఇటీవల జరిగిన మానిటరీ పాలసీ కమిటీ సమావేశంలో తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఈ మేరకు జూన్ 6- 8 తేదీల్లో జరిగిన ఎంపీసీ మినిట్స్ బయటకొచ్చాయి. దేశ స్థూల ఆర్థిక పరిస్థితులు బలోపేతం అవుతున్నాయని, వృద్ధి అవకాశాలు క్రమంగా మెరుగుపడుతున్నాయని శక్తికాంత దాస్ అభిప్రాయపడ్డారు. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చిందని, బ్యాంకులు, కార్పొరేట్‌ల బ్యాలెన్స్ షీట్‌లు సైతం ఆరోగ్యవంతంగా తయారయ్యాయని పేర్కొన్నారు. ఇవి వృద్ధికి ఊతం ఇస్తాయన్నారు. అయితే, ద్రవ్యోల్బణం కట్టడిలో నిర్దేశిత స్థాయికి తీసుకురావడంలో మన పని సగమే పూర్తయ్యిందని శక్తికాంత దాస్ పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం- వృద్ధి దృక్పథాన్ని అంచనా వేయడానికి ఎంతో ముందుచూపుతో వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భవిష్యత్‌లో ఎలా ముందుకెళ్లాలనే దానిపై నిర్దిష్ట అంచనాకు రావడం కష్టంతో కూడుకున్న వ్యవహారంగా పేర్కొన్నారు. దేశంలో ద్రవ్యోల్బణం అదుపులోకి తీసుకురావాలని కేంద్రం ఆర్‌బీఐకి సూచించింది. ముఖ్యంగా రిటైల్ ద్రవ్యోల్బణం 2-6 శాతం మధ్య ఉండాలని పేర్కొంది. ఈ క్రమంలోనే ఆర్‌బీఐ వరుసగా రేట్లు పెంచింది.

రెపో రేటు 6.5 శాతానికి చేర్చింది. దీంతో ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టింది. మే నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.25 శాతానికి దిగొచ్చింది. మరోవైపు ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చిన నేపథ్యంలో గత రెండు ద్వైమాసిక పరపతి విధాన సమీక్ష నిర్ణయాల్లో వడ్డీ రేట్లలో ఆర్‌బీఐ ఎలాంటి మార్పు చేయలేదు.

# నిండుకున్న ఆక్సిజన్.. శబ్దాలు వచ్చినా.. కనిపించని జాడ

దిల్లీ : సముద్రగర్భంలో ఆచూకీ లభించకుండా పోయిన టైటాన్ కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న రెస్క్యూ సిబ్బంది రంగంలోకి దిగి గాలిస్తున్నారు. ఇప్పటికే మూడు రోజులు కావొస్తోన్న నేపథ్యంలో.. టైటాన్ ఆచూకీ మాత్రం లభించలేదు. కొన్ని ప్రాంతాల్లో శబ్దాలు వినిపిస్తున్నప్పటికీ రెస్క్యూలో ఎటువంటి పురోగతి కనిపించలేదు. అయితే, అందులోని ఆక్సిజన్ నిండుకోవడం ఆందోళన కలిగిస్తోంది. భారత కాలమాన ప్రకారం, గురువారం సాయంత్రం 7.15 నిమిషాల వరకే ఆక్సిజన్ సరిపోతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయినప్పటికీ టైటాన్ ఆచూకీ లభించకపోవడంతో రెస్క్యూ ఆపరేషన్‌పై ప్రపంచ వ్యాప్తంగా ఉత్కంఠ కొనసాగుతోంది.

టైటానిక్ శకలాలను చూసేందుకు వెళ్లిన ఈ టైటాన్ మినీ జలాంతర్గామి కోసం అమెరికా కోస్ట్ గార్డ్, కెనడా సైనిక విమానాలు, ఫ్రెంచ్ నౌకలు, టెలీగైడెడ్ రోబోలు భారీ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి.

అత్యవసర పరిస్థితుల్లో 96 గంటలపాటు ఆక్సిజన్ ఉండేలా ఈ జలాంతర్గామిని రూపొందించారు. అమెరికా కోస్ట్ గార్డ్ ప్రకారం.. మినీ జలాంతర్గామిలో కేవలం కొన్ని గంటలకు (గురువారం సాయంత్రం 7.15నిమిషాల వరకు) మాత్రమే సరిపడా ఆక్సిజన్ మిగిలి ఉన్నట్లు అంచనా. అందులోని పర్యాటకులు, సిబ్బందికి అవసరమైన ఆహారం కూడా పరిమితంగా ఉండటం కూడా ఆందోళన కలిగించే విషయం.

సోనార్ సామర్థ్యం కలిగిన కెనడా విమానం కూడా కొన్ని శబ్దాలను గుర్తించింది. దీంతో ఇతర ప్రదేశాల నుంచి పనిచేస్తున్న రెస్క్యూ బృందాలు శబ్దాలు వస్తున్న ప్రదేశానికి వెళ్లి అన్వేషణ మొదలుపెట్టాయి. ఇవి గల్లంతైన మినీ జలాంతర్గామివే కావచ్చని అన్వేషణ బృందాలు భావించి నప్పటికీ.. అవి కచ్చితంగా ఎక్కడనుంచి వస్తున్నాయనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. సెర్చ్ ఆపరేషన్ మధ్యలో ఉన్నామని.. తమకు పూర్తి విశ్వాసం ఉందని కోస్ట్‌గార్డ్ కెప్టెన్ జమీ ఫ్రెడెరిక్ పేర్కొన్నారు. ఒక్కోసారి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని.. అయితే, ఇంకా ఆ పరిస్థితి రాలేదన్నారు. మరోవైపు ఈ జలాంతర్గామి భద్రతపై 2018లో ఓసారి నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని అమెరికన్ బ్యూరో ఆఫ్ షిప్పింగ్‌తో ధ్రువీకరణ పొందేందుకు ఆ సంస్థ నిరాకరించిందనే ఆరోపణలు ఉన్నాయి.

పాకిస్థాన్ బిలియనీర్ షెహజాదా దావూద్ (48), ఆయన కుమారుడు సులేమాన్ (19), యూఏఈలో ఉంటున్న బ్రిటిష్ వ్యాపారవేత్త హమీష్ హార్డింగ్, ఈ యాత్ర నిర్వాహకుడు, ఓషన్‌గేట్ వ్యవస్థాపకుడు స్టాక్టన్ రష్, ఫ్రెంచ్ మాజీ నావికా అధికారి పాల్ హెన్రీ ఈ జలాంతర్గామిలో ఉన్నారు.



VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com